విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily






సంపుటి : 4 | సంచిక :82 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 12 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



## మా డిమాండ్లలో ఎలాంటి మార్పు లేదు



- మొదటి నుంచి ఒకటే వైఖరి : ఖర్గే
- మూడు అంశాలపై విపక్షాల వైఖరి మారలేదన్న మల్లికార్జున ఖర్గే
- జంతర్ మంతర్ విద్యార్థులపై లాఠీఛార్జ్, కాల్పులపై ప్రకటనకు డిమాండ్
- రామ మందిర విరాళాల దుర్వినియోగంపై సమాధానం చెప్పాలని పట్టుబాటు

## శబరిమల మహిళల ప్రవేశంపై అక్టోబర్‌లో సుప్రీం తీర్పు

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ హింట్
- బోధ్ గయ ఆలయ నిర్వహణ కేసు విచారణ సందర్భంగా చెప్పిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్
- మే 14న తీర్పును రిజర్వ్ చేసిన రాజ్యాంగ ధర్మాసనం
- ఆలయంతో సహా మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్



### సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు

# గ్రీన్ సిగ్నల్



- పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు
- అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు తొలగిన అడ్డంకులు
- భూసేకరణ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన రైతులు
- నిబంధనల ప్రకారమే ముందుకెళ్తున్నామని వాదనలు వినిపించిన ఏజీ దమ్మాలపాటి

**అమరావతి**

రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన 'సీడ్ యాక్సెస్ రోడ్డు' పనులకు ఉన్న న్యాయ పరమైన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. దీంతో రాజధానిలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణ పనులకు మార్గం సుగమం అయింది. సీఆర్డీఏ పరిధిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్

వివరాలు 2లో..



## చంద్రుడిపై 'మూన్ బేస్'

- ఇస్రోకు నాసా ఆహ్వానం
- భారత్, అమెరికా బాండ్ మరింత స్ట్రాంగ్!
- చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద మానవ స్థావరం ఏర్పాటుకు అమెరికా ప్రణాళిక
- ప్రతిష్ఠాత్మక మూన్ బేస్ కార్యక్రమంలో చేరాలని ఇస్రోకు నాసా ఆహ్వానం
- బెంగళూరులో భారత్–అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశం

### ప్రతికూల పరిస్థితుల్లోనూ 10.7 శాతం సానుకూల

# ఆర్థిక వృద్ధిరేటు

- 2026 జులై నెల ఆర్థిక నివేదికను సీఎంకు అందించిన ప్రణాళిక విభాగం
- ఎల్‌నినో సంక్షోభంలోనూ ఏపీకి సానుకూల వృద్ధి ఉందని నివేదికలో వెల్లడి
- 2025–26 రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటు
- ఆర్థిక వ్యవస్థ స్థిరమైన ప్రగతిని కనబరుస్తోంది



**అమరావతి**

రాష్ట్రం ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ 10.7 శాతం సానుకూల ఆర్థిక వృద్ధిరేటు సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర వృద్ధిరేటును 15 శాతానికి తీసుకెళ్లేలా ప్రతి ప్రభుత్వ శాఖ వనరులను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దిష్ట లక్ష్యాలతో ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి వరకు సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషిస్తూ, సామాన్యుడిపై ఎలాంటి ధరల భారం పడకుండా తగిన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. జులై 2026 నెలవారీ నివేదికను ప్రణాళిక శాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సచివాలయంలో అందచేశారు. రాష్ట్రంలో ఎల్?నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదైనప్పటికీ స్థూల ఉత్పత్తి పడిపోకుండా అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే ప్రతి ప్రభుత్వ

వివరాలు 2లో..

### 158 గ్రామాలకు తొలిసారి

# రహదారి



- చిట్టచివరి గ్రామానికి సైతం రోడ్డు సౌకర్యం
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పవన్ ఆదేశం
- పంచాయతీరాజ్ అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష
- మరో 158 ఆవాసాలకు తొలిసారి రహదారి సౌకర్యం
- ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.422.10 కోట్ల నిధులు

**అమరావతి**

రాష్ట్రంలోని చిట్టచివరి గ్రామానికి సైతం రోడ్డు సౌకర్యం కల్పించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు గ్రామీణ రహదారుల నిర్మాణంపై పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే అడవితల్లి బాట పేరిట అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎన్నో గిరిజన గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం కల్పించారు. ఇప్పుడు మైదాన ప్రాంతాల్లో మారుమూల పల్లెలు, ఆవాసాలకు, కుగ్రామాలకు రోడ్లు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 158 మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు నిర్మించేందుకు పరిపాలన అనుమతులిచ్చారు. 347 కిలోమీటర్ల పొడవున, 146 రోడ్లు, 19 వంతెనల నిర్మాణం

వివరాలు 2లో..

### భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం..

## మార్చడం ఎవరితరం కాదు

- ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరన్న విదేశాంగ శాఖ
- 27 ప్రాంతాలకు భారత పేర్లపై చైనా అభ్యంతరం
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న భారత్
- ఆగస్టు 6న ఎల్ఏసీ పరిస్థితిపై చర్చలు
- దౌత్య, సైనిక మార్గాలు కొనసాగించేందుకు అంగీకారం





### మొరాయించిన

# పాస్‌పోర్టు సర్వర్లు

- విజయవాడలో దరఖాస్తుదారుల పడిగాపులు
- దేశవ్యాప్తంగా నిలిచిపోయిన పాస్‌పోర్టు సేవలు
- విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ కేంద్రాల్లో తీవ్ర అంతరాయం
- స్లాట్లు బుక్ చేసుకుని వచ్చి అవస్థలు పడుతున్న దరఖాస్తుదారులు

**అమరావతి**

దేశవ్యాప్తంగా పాస్‌పోర్టు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టెక్నికల్ సమస్యల కారణంగా పాస్‌పోర్టు సర్వర్లు ఒక్కసారిగా మొరాయించాయి. దీంతో ఆన్‌లైన్ సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సర్వర్ల డౌన్ ప్రభావం తెలుగు రాష్ట్రాలపై తీవ్రంగా

వివరాలు 2లో..

PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
బుధవారం 12 ఆగస్టు 2026

# మొరాయించిన పాస్‌పోర్టు సర్వర్లు

-మొదటిపేజీ తరువాయి

పడింది. విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని పాస్‌పోర్టు కార్యాలయాల్లో సర్వర్లు పని చేయకపోవడంతో సేవల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచే దరఖాస్తుదారులు బారులు తీరారు. సర్వర్లు ఎప్పుడు తిరిగి పని చేస్తాయో తెలియక గంటల తరబడి కార్యాలయం వద్దే పడిగాపులు కాస్తున్నారు. కొత్త పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, పునరుద్ధరణ (రెన్యువల్) కోసం వచ్చిన వారు, పాస్‌పోర్టు పాడైపోయి కొత్తవాటికి స్లాట్లు బుక్ చేసుకున్న వారు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు. అపాయింట్‌మెంట్ తీసుకున్న వారిలో విద్యార్థుల సంఖ్యే అధికంగా ఉంది. సర్వర్ స్లో కావడంతో దరఖాస్తుల ప్రక్రియ ఏమాత్రం ముందుకు సాగడం లేదని అభ్యర్థులు చెబుతున్నారు.

### ముందస్తు సమాచారం కరవు

సాంకేతిక సమస్యపై అధికారులు తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన స్లాట్ ప్రకారం సమయానికి కార్యాలయానికి వస్తే, కనీసం లోపలికి కూడా అనుమతించడం లేదని మండిపడుతున్నారు. సర్వర్లు మొరాయించిన విషయాన్ని కనీసం ఫోన్‌కు మెసేజ్ రూపంలో కూడా తెలపలేదని వాపోతున్నారు. కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి చూద్దామంటే, కనీసం కూర్చోవడానికి కుర్చీలు, తాగడానికి మంచినీళ్లు కూడా లేక అవస్థలు పడుతున్నట్లు వివరించారు.

### దూర ప్రాంతాల నుంచి

విజయవాడ పాస్‌పోర్టు కార్యాలయానికి కేవలం స్థానికులే కాకుండా రాష్ట్రంలోని పలు మూలల నుంచి ప్రజలు వచ్చారు. రాయలసీమ, ఉమ్మడి గోదావరి జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరులతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కూడా దరఖాస్తుదారులు ఇక్కడికి తరలివచ్చారు.



ఒక్కొక్కరికి ఒక్కో స్లాట్ సమయం కేటాయించడంతో లోపలికి అనుమతించకపోవడంతో తమ సమయం దాటిపోతుందేమోనని వారు ఆందోళన చెందారు. సర్వర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఇంత దూరం నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తే నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### అపాయింట్‌మెంట్స్ రీషెడ్యూల్

సర్వర్ల సమస్య ఇప్పట్లో పరిష్కారం అయ్యేలా కనిపించకపోవడంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇవాళ్టి అపాయింట్‌మెంట్లను మరో రోజుకు రీషెడ్యూల్ చేసినట్లు దరఖాస్తుదారులకు అధికారికంగా తెలిపారు. సర్వర్ సమస్య కారణంగా ఇవాళ సేవలు అందించలేకపోతున్నామని వివరించారు. దరఖాస్తుదారులందరికీ ఈ నెల 17వ తేదీన మొబైల్‌కు ఒక మెసేజ్ వస్తుందని స్పష్టం చేశారు. ఆ మెసేజ్‌లో సూచించిన కొత్త తేదీల్లోనే కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో చేసేదేమీ లేక ప్రజలు నిరాశగా ఇళ్లకు వెనుతిరుగుతున్నారు.

"మేము పాస్‌పోర్టు పని మీద చాలా దూరం నుంచి ఇక్కడికి వచ్చాం. మాకు కేటాయించిన స్లాట్ సమయానికే చేరుకున్నాం. కానీ తీరా వచ్చాక సర్వర్లు పనిచేయడం లేదని చెబుతున్నారు. ఈ విషయం మాకు ముందుగా ఒక మెసేజ్ ద్వారా చెప్పి ఉంటే ఇంత దూరం వచ్చి ఇబ్బంది పడేవాళ్లం కాదు. ఇక్కడ కనీసం కూర్చోవడానికి సరైన వసతి లేదు, తాగడానికి నీళ్లు లేవు. మళ్లీ 17వ తేదీన మెసేజ్ వస్తుందని, అప్పుడు కొత్త తేదీ ఇస్తామని చెబుతున్నారు. దీనివల్ల మాకు సమయం, డబ్బు వృథా అవుతున్నాయి." -దరఖాస్తుదారులు

# వైసీపీకి బూమ్ రాంగ్ అవుతోందా

**విజయవాడ :** రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, చట్టాలు-పరిపాలనపై క్షుణ్ణమైన అవగాహన ఉన్న ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ వంటి వైఎస్సార్సీపీ సీనియర్ నేతలకు ఏది ప్రజాదరణ పొందే అంశమో, ఏది శూన్యమైన విమర్శో స్పష్టంగా తెలుసు. దశాబ్దాల తరబడి ఎన్నికల రాజకీయాలను ఒంటబట్టించుకున్న ఈ అనుభవజ్ఞులకు.. కనీస ఆధారం లేకుండా ప్రతిపక్షం లేవనెత్తే అంశాలు ప్రతికూలతను పెంచుతాయే తప్ప, ప్రజల నుంచి ఒక్క శాతం కూడా సానుకూలతను తీసుకురావు అనే నిలువెత్తు సత్యం తెలియంది కాదు. అయినా సరే, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశిస్తున్న వ్యూహాలకు తలొగ్గి, తమ సొంత రాజకీయ క్రెడిబిలిటీని బలిపీఠం ఎక్కించేసుకుంటున్నారు.గతంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ హయాం నుంచి నేటి వైఎస్సార్సీపీ వరకు సీనియర్ నాయకులుగా చెరగని ముద్ర వేసుకున్న ఈ నేతలు.. జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష రాజకీయ శైలి వల్ల సమాజంలో తమ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారనే చర్చ నడుస్తోంది. డీఎస్సీ వంటి నిరుద్యోగ సున్నిత అంశాలపై ఎటువంటి డాక్యుమెంటరీ ఆధారాలు లేకపోయినా, కోర్టుల్లో విచారణకు కూడా నిలబడే సాక్ష్యాలు చూపించలేకపోయినా.. జగన్ మైక్ ముందు చెప్పిన ప్రతిపాయింట్‌నూ కిందిస్థాయిలో బలవంతంగా మోయాల్సి రావడం వారి రాజకీయ అనుభవానికే అవమానకరంగా మారింది. ఆధారం లేని పోరాటం వల్ల ఎంపికైన 16,000 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది.తన స్వయంకృతాపరాధ నిర్ణయాలతో స్వయంగా నెత్తిపై చేయి పెట్టుకునే భస్మాసుర రాజకీయాన్ని జగన్ నడుపుతుంటే, సీనియర్లు తెలిసీ తెలియక అందులో భాగస్వాములు అవుతున్నారనేది నిగ్గు తేలిన నిజం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి నెట్‌వర్క్ చెప్పినట్లే వినాల్సి వచ్చిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సరే అదే తీరు కొనసాగుతోందని అంతర్గత మథనం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో సంపాదించుకున్న గుర్తింపును, ఇమేజ్‌ను ఒకే వ్యక్తి రాజకీయ ఆధిపత్యం, వ్యర్థ రాజకీయ ఎజెండాల కోసం ధారపోయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.ఇంత బతుకు బతికి సొంత రాజకీయాన్ని, స్వయంప్రతిపత్తిని పక్కనబెట్టి జగన్ రెడ్డి వద్ద ఈ రకంగా డీలా పడిపోవడానికి వారి మనసు ఎలా ఒప్పుతుందోగానీ, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే వారి రాజకీయ జీవితాలకు ఇది తీవ్రమైన నష్టం చేకూరుస్తుంది. అధినేత చెప్పే తప్పుడు



కథనాలకు మద్దతుగా ప్రెస్ మీట్లు పెట్టడం ఆపి, ఇప్పటికైనా తమ రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాల్సిన తక్షణం ఆసన్నమైంది. సమాజంలో తమకున్న గౌరవాన్ని కాపాడుకోవడానికైనా లేదా ప్రత్యామ్నాయ రాజకీయ దారులు చూసుకోవడానికైనా ఈ సీనియర్ నాయకులు మౌనం వీడాల్సిన అవసరం ఉంది.

సాంకేతిక అవకతవకలు, అక్రమాలు

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్షం ఆది నుంచి ఆరోపణలు గుప్పిస్తూనే ఉంది. అయితే ఆ ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క బలమైన చట్టబద్ధమైన ఆధారాన్ని కూడా వైసీపీ బయటపెట్టలేకపోయింది. సాంకేతిక అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఎన్ని కథనాలు అల్లినా, నిరుద్యోగులు గానీ, పరీక్ష రాసిన వేలాది మంది అభ్యర్థులు గానీ వాటిని నమ్మే పరిస్థితి లేదు. న్యాయస్థానాలను ఆశ్రయించి పక్కా సాక్ష్యాధారాలతో సీబీఐ విచారణ కోరడంలో ఆ పార్టీ తరఫు నేతలు ఘోరంగా విఫలమయ్యారు. కోర్టుల్లో నిలబడని, ఆధారాలు సమర్పించలేని కథనాలతో వీధుల్లో రచ్చ చేయడం వల్ల ఆ పార్టీ చేస్తున్నది ప్రజాపోరాటం కాదని, కేవలం ఒక కుట్రపూరిత తప్పుడు రాజకీయం అని సామాన్య ప్రజలకు సైతం అర్థమైపోయింది.అన్నింటికంటే ముఖ్యంగా, ఈ ఉనికి లేని వివాదం వల్ల వైఎస్సార్సీపీ సమాజంలో తీవ్ర ప్రతికూలతను మూటగట్టుకుంటోంది. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 16,347 మంది ఉపాధ్యాయులు, వారి వెనుకున్న వేలాది కుటుంబాలు ఇప్పుడు ప్రతిపక్ష వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. దశాబ్దాల కష్టంతో, పారదర్శకమైన పోటీలో తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమ అర్హతలను, ఆత్మగౌరవాన్ని పదేపదే శంకిస్తూ పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకోవడాన్ని ఆ ఉపాధ్యాయ లోకం సహించలేకపోతోంది. రాయలసీమ నుంచి మొదలై కోస్తాంధ్ర వరకు ఈ ఉద్యోగ విజేతలు ఉపాధ్యాయ ఆత్మగౌరవ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతున్నారు.ప్రజాబలం తోడుకాకపోగా, యువత నుంచి మద్దతు లభించకపోగా, పైగా ఎంపికైన 16 వేలకు పైగా కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకోవడం రాజకీయంగా ఎంత పెద్ద వ్యూహాత్మక తప్పిదమో స్పష్టమవుతోంది. రాలగొట్టుకోవడానికి ఏ రాయి అయితే ఏమిటి అన్నట్లుగా ఆలోచన లేకుండా ఒక ప్రతికూల అంశాన్ని పదేపదే పట్టుకుని వేలాడటం వల్ల వైసీపీకి లభించే రాజకీయ లబ్ధి సున్నా సరేకదా, ఉన్న అరకొర క్రెడిబిలిటీని కూడా నట్టేట ముంచేస్తోంది. ప్రజామోదం లేని ఇటువంటి వ్యర్థ పోరాటాల వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి పడకపోగా, ప్రతిపక్షం తన సొంత ఓటు బ్యాంకునే మరింత దూర చేసుకుంటోందనేది అసలు నిజం

# నిందితులకే మద్దతా...

## నిన్న అప్పలరాజు... ఇవాళ పాస్టర్ కోడుకు

**రాజమండ్రి :** రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకపై కారు ఎక్కించి దారుణంగా హత్య చేసిన ఉదంతం రాజకీయంగా, సామాజికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ ప్రసిద్ధ పాస్టర్ కుమారుడు కావడంతో, ఈ వ్యవహారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తీవ్రమైన సంకట పరిస్థితిని తెచ్చిపెట్టింది. ఒకవైపు నిందితుడు తమకు అత్యంత కీలకమైన ఓటు బ్యాంక్ వర్గానికి చెందిన కుటుంబ నేపథ్యం కలవాడు కావడం, మరొకవైపు అత్యంత కిరాతకానికి గురైన బాధితురాలు వైద్య విద్యార్థిని కావడం వల్ల.. ఈ కేసులో ఎటువైపు నిలబడాలో తెలియక వైసీపీ రాజకీయ డైలమాలో పడింది. ఈ విమర్శలు రావడంతో చివరికి జగన్ ప్రభుత్వాన్ని నిందిస్తూ ఓ ట్వీట్ చేసి పడేశారు.ఇటీవల కాశిబుగ్గ సమీపంలో మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ జరిపిన హిట్ అండ్ రన్ కేసులో ఒక పేద గొర్రెల కాపరి దానయ్య ప్రాణాలు కోల్పోతే, వైసీపీ అనుసరించిన వైఖరి పైనే ఇప్పుడు ప్రధాన చర్చ జరుగుతోంది. ఆ కేసులో సొంత పార్టీ నేత కుమారుడిని రక్షించేందుకు వేరొక అనామకుడిపై నింద మోపే ప్రయత్నం చేశారు. దానయ్యను కాపాడే ప్రయత్నం చేయలేదు. దానయ్య కుటుంబాన్ని ఆదుకోలేదు. తప్పుడు కుట్రలు చేసినందుకు సీదిరి అప్పలరాజుపై కేసు నమోదు చేస్తే దాన్ని రాజకీయ కక్ష సాధింపు గా జగన్ రెడ్డి వర్గీకరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బాధితుడైన గొర్రెల కాపరి కుటుంబం ఆవేదనను పక్కనపెట్టి, కేవలం తమ పార్టీ నేత, కుల సమీకరణాలకే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. మత్స్యకార నాయకుడ్ని వేధిస్తున్నట్లుగా ప్రచారం చేశారు.ఇదే ప్రాతిపదికన విశ్లేషిస్తే, ఇప్పుడు రాజమండ్రి కేసులో కూడా వైసీపీ అదే తరహా సొంత వర్గ రక్షణ వ్యూహాన్ని అమలు చేస్తుందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జోసెఫ్ ఎడ్వర్డ్స్ కుటుంబం సామాజికంగా, మతపరంగా వైసీపీకి సాంప్రదాయకంగా మద్దతు ఇచ్చే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇప్పుడు గనుక రాజమండ్రి కేసులో నిందితులకు కఠిన శిక్ష పడాలని, వారిపై ఉద్దేశపూర్వక హత్య సెక్షన్లు సమర్థనీయమేనని వైసీపీ డిమాండ్ చేస్తోంది పైపైకే. ఎందుకంటే ప్రజాగ్రహం ఎక్కువగా ఉంది కాబట్టి ఇలా ప్రియాంక కోసం మాట్లాడుతున్నారు. మరి కాశిబుగ్గ కేసులో అప్పలరాజు కొడుకుపై చట్టం చర్యలు తీసుకున్నప్పుడు ఎందుకు వ్యతిరేకించారు? అక్కడ లేని న్యాయసూత్రాలు ఇక్కడ మాత్రమే గుర్తుకొచ్చాయా?అంతేకాకుండా, ప్రియాంక తండ్రి కడుపుకోతతో మాట్లాడుతున్న మాటలను సైతం రాజకీయంగా వక్రీకరిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే అయినప్పుడు, ఒక నిందితుడు తమ పార్టీ నేత కొడుకైనా, లేక ఓటు బ్యాంకుకు చెందిన ప్రముఖుడి కొడుకైనా శిక్ష ఒకేలా ఉండాలన్న కనీస ధర్మాన్ని వైసీపీ విస్మరిస్తోంది. బాధితురాలైన డాక్టర్ ప్రియాంక కుటుంబానికి న్యాయం జరగాలనే డిమాండ్ ఏపీవ్యాప్తంగా మిన్నంటుతున్న వేళ, వైసీపీ ద్వంద్వ వైఖరి ఆ పార్టీ విశ్వసనీయతను మరింత దిగజారుస్తోంది. సీదిరి అప్పలరాజు కేసులో బాధితుడికి ఒక న్యాయం, రాజమండ్రి కేసులో మరో న్యాయం అన్నట్లుగా రాజకీయాలు చేస్తున్నారు

## ప్రతికూల పరిస్థితుల్లోనూ 10.7 శాతం సానుకూల ఆర్థిక వృద్ధిరేటు

-మొదటిపేజీ తరువాయి

శాఖలోనూ అత్యాధునిక టెక్నాలజీని అనుసంధానించి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కృష్ణా నదిలో ప్రవాహాలు లేకపోవడంతో గోదావరి వరద నీటిని మళ్లించి కృష్ణా డెల్టాను ఆదుకున్నామన్నారు. భూగర్భ జలాలు తగ్గుతున్న తరుణంలో నీటి లభ్యత, ఉత్పత్తుల విలువ జోడింపుపై ప్రత్యేక కంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలపై నిత్యావసర ధరల భారం పడకుండా నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ మార్కెట్లకు అయ్యే ఎగుమతులపై ఎలాంటి ప్రభావం పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. లక్ష్య సాధన తేలికయ్యేలా జిల్లా, నియోజకవర్గం, మండల వారీగా నివేదికలు తయారు చేయాలని నిర్దేశించారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు సమర్థవంతంగా అందించేలా ప్రతి ప్రణాళిక రూపుదిద్దుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గడచిన రెండేళ్లుగా జాతీయ సగటు కంటే మెరుగైన రీతిలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన ప్రగతిని కనబరుస్తోందని ప్రణాళికా విభాగం నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచినట్లు నివేదికలో పేర్కొన్నారు.

పశుసంవర్ధక శాఖ పరిధిలో మాంసం ఉత్పత్తి 9.6 శాతం, గుడ్ల ఉత్పత్తి 5.1 శాతం మేర గణనీయంగా పెరిగాయి. సేవా రంగాన్ని పరిశీలిస్తే సమాచార సాంకేతికత, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయి. వాణిజ్య వాహనాల నమోదు ఏకంగా 51.6 శాతం పెరగడం రాష్ట్రంలో పుంజుకున్న ఆర్థిక లావాదేవీలకు నిదర్శనంగా నిలుస్తోంది. నిరంతరం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం వల్లనే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని సీఎం అన్నారు.

జీఎస్టీ పన్ను వసూళ్లు 21 శాతం: ప్రభుత్వ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ కారణంగా జీఎస్టీ పన్ను వసూళ్లు 21 శాతం వృద్ధితో 13 వేల 282 కోట్లకు చేరుకున్నాయి. సాధారణ ఎగుమతుల్లో 16 వేల 322 కోట్లతో 10.5 శాతం వృద్ధి నమోదైంది. ≈ూ× ద్వారా సాగిన ఎగుమతులు 32.2 శాతం మేర భారీగా పెరిగాయి. రాష్ట్రంలో 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడులు గ్రౌండింగ్ కావడంతో పాటు ఎంఎస్?ఎంఈ రంగంలో 60 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చి చేరాయి. పన్ను, పన్నేతర ఆదాయాలు గణనీయంగా పెరిగాయి.

## 158 గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం

-మొదటిపేజీ తరువాయి

చేపట్టనున్నారు. 13 జిల్లాల్లో రహదారి సౌకర్యం లేని ఆవాసాలను గుర్తించి, అంచనాలు రూపొందించామన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.422.10 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. రోడ్ల నిర్వహణకు మరో రూ.24.47 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. మారుమూల గ్రామాలకు నిర్మించే రహదారుల నాణ్యత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని అధికారులను పవన్ కల్యాణ్? ఆదేశించారు. రోడ్లు, వంతెనల నిర్మాణంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఏర్పడి, ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

### ఏపీకి రెండో ర్యాంకు

మరోవైపు ఇటీవలే గ్రామీణ రహదారుల నిర్మాణంలో ఏపీ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన' పనుల్లో గుజరాత్ మొదటి ర్యాంకును కైవసం చేసుకోగా, ఆంధ్రప్రదేశ్? రెండో ర్యాంకు దక్కించుకుంది. రహదారుల నాణ్యత విషయంలో రాష్ట్రం అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర ప్రభుత్వం ప్రశంసల వర్షం కురిపించింది. వైఎస్సార్సీపీ పాలనలో 19వ స్థానంలో ఉన్న ఏపీ ఇప్పుడు ఏకంగా రెండో స్థానానికి ఎగబాకడం విశేషం.

ఇందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న ప్రత్యేక చర్యలే కారణం. గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ఆయన మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ రోడ్డు కావాలని ప్రజలు కోరినా, కేవలం గంటల వ్యవధిలోనే ఆ పనులను ఆయన మంజూరు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను పర్యవేక్షించేందుకు సమర్థులైన అధికారులను నియమించారు.

అంతేకాక పవన్ కల్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను క్షేత్రస్థాయికి వెళ్లి నిశితంగా పరిశీలించారు. ఈ క్రమంలోనే కాంట్రాక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పవన్ కల్యాణ్ కఠిన వైఖరితో రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పెరిగాయి. రాజీ లేని నాణ్యతతో పల్లె ప్రజలకు మంచి రహదారులు అందుబాటులోకి వచ్చాయి.

## సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. అయితే ఈ భూసేకరణ విషయంలో అధికారులు చట్ట నిబంధనలను ఏమాత్రం అనుసరించలేదని ఆరోపిస్తూ పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను, దానికి అనుగుణంగా ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పలు వ్యాజ్యాలు దాఖలు చేశారు.

### ప్రభుత్వ వాదనలు ఇవే

రైతుల పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని కోర్టుకు వివరించారు. ఎక్కడా చట్ట ఉల్లంఘనలు జరగలేదని స్పష్టం చేశారు. పక్కాగా చట్ట నిబంధనల ప్రకారమే భూసేకరణ చేపడుతున్నామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రైతులు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు.

### విస్తృత ప్రయోజనాల దృష్ట్యా

రైతులు, ప్రభుత్వం తరఫున వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం ఇటీవల ఈ వ్యవహారంపై తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా రైతులు వేసిన పిటిషన్లను కొట్టివేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. సీడ్ యాక్సెస్ రోడ్డు అనేది రాజధాని నిర్మాణంలో భాగమని, ఇది విస్తృత ప్రజానీకం ప్రయోజనాలతో ముడిపడి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి విస్తృత ప్రయోజనాల దృష్ట్యా జరుగుతున్న ప్రక్రియను తాము అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు పూర్తిగా తొలగిపోయినట్లయింది.

## డీఎస్సీపై ఒంటరి పోరు

**గుంటూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ 2025 పై ఉద్యమం చేపడుతోంది. అయితే ఈ ఉద్యమం విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏం ఆశిస్తుందో తెలియడం లేదు కానీ.. ప్రజల్లోకి ఈ అంశం వెళ్లడం లేదు. పైగా కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. సమాజంలో అస్థిరతను, గందరగోళాన్ని సృష్టించేందుకే డీఎస్సీ పై విష ప్రచారం చేస్తున్నారు అంటూ కొంతమంది మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వాన్ని వ్యతిరేకించే న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ సైతం ఈ విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు. ఇప్పుడు జాతీయ పార్టీ కాంగ్రెస్ సైతం దీనిని తీవ్రంగా తప్పుపడుతోంది. వేలాదిమంది ఉపాధ్యాయుల్లో అశాంతి నింపడమే అవుతుందని తేల్చి చెబుతోంది. ప్రజా సమస్యలు గాలికి వదిలి డీఎస్సీ 2025 పై విషం చిమ్మడంపై తీవ్రస్థాయిలో ఆక్షేపిస్తోంది. కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు జగన్మోహన్ రెడ్డి తీరుపై మండిపడ్డారు. ఇంత జరిగాక కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది.సమకాలీన అంశాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ పై ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో వేలాది మంది ఉపాధ్యాయులు కర్నూలు కొండారెడ్డి బురుజు సెంటర్ పై ఆత్మగౌరవం పేరుతో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో రాయలసీమ వాసిగా.. బాధ్యతాయుతమైన కేంద్ర మాజీ మంత్రిగా స్పందించారు చింతా మోహన్. అసలు డీఎస్సీ పై ఉద్యమం ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు.

## హరిత ఆంధ్రప్రదేశ్ లో భాగంగా మొక్కలు

# నాటిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా.










అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 11: 'హరిత ఆంధ్రప్రదేశ్' మిషన్ లో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మొక్కలు నాటి పర్యావరణ పరి రక్షణ పట్ల తన బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. ?ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మానవ మనుగడకు, ఆరోగ్యకర మైన జీవితానికి మొక్కలు అత్యంత ఆవశ్యకం అన్నారు. చెట్ల ద్వారా స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించడమే కాకుండా పర్యావరణ సమతుల్యత కూడా కాపాడబడుతుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని పూర్తి బాధ్యతతో పెంచి పెద్ద చేయాలి అని సూచించారు. హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణను ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు తో పాటు డీఎస్పీ కె.రవికుమార్, ఏ.ఓ సిహెచ్.తిలక్ బాబు, సిఐలు రామకృష్ణారావు, బాల సూర్యరావు, లక్ష్మి, వెంకటనారాయణ, సతీష్, రమణయ్య, రమేష్ ఎస్సైలు ప్రసాద్, సురేష్ బాబు, అంజిబాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ లు ప్రతాప్ శేషయ్య, దేవరాజు ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

## 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ప్రారంభం.

**గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు ఉచిత రవాణా సేవలు.**

**ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజులతో కలిసి ప్రారంభించిన జేసీ జి. విద్యాధరి.**



విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 11: గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, సకాలంలో వైద్య సేవలు అందించడంతో పాటు మాతా-శిశు ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న '102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి లాంఛనంగా ప్రారంభించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు భాగస్వామ్య మై జెండా ఊపి వాహనాలను అందుబాటు లోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాల రేటును తగ్గించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రసవానంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడం, పేద కుటుంబాలపై రవాణా వ్యయ భారాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను ఇద్దరు సహాయకులతో కలిసి పూర్తిగా ఉచితంగా ఇంటి వద్దకు చేర్చే పోస్ట్‌నేటల్ డ్రాప్‌బ్యాక్ సౌకర్యాన్ని '102 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్' ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. అలాగే హై-రిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలు, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ చికిత్సలు, ప్రత్యేక వైద్య పరీక్షలు, రక్త మార్పిడి వంటి అత్యవసర వైద్య అవసరాల కోసం ఆసుపత్రులకు ఉచితంగా తరలించి తిరిగి ఇంటికి చేర్చే సేవలను కూడా ఈ వాహనాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలుకు విశాఖపట్నం జిల్లాకు 16 అత్యాధునిక వాహనాలు కేటాయించారని జేసీ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో కింగ్ జార్జ్ ఆసుపత్రి వద్ద 9, అగనంపూడి వద్ద 2, విక్టోరియా ఆసుపత్రి వద్ద 5 వాహనాలు అందుబాటులో ఉంచి సేవలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వాహనాల్లో రియర్ సీట్ బెల్టులు, ఎయిర్ బ్యాగ్‌లు, అగ్నిమాపక పరికరాలు, ఎయిర్ కండీషనింగ్, మొబైల్ ఛార్జింగ్ సదుపాయం, హ్యాండ్ శానిటైజర్, టిష్యూ పేపర్లు, డస్ట్‌బిన్ వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రియల్‌టైమ్ జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ, అత్యవసర పరిస్థితుల్లో కాల్ సెంటర్‌కు సమాచారం చేరవేసే ఎమర్జెన్సీ అలర్ట్ స్విచ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో తల్లి-శిశు ఆరోగ్యం, శిశు పోషణ, ప్రసవానంతర సంరక్షణకు సంబంధించిన అవగాహన సందేశాలను ప్రసారం చేసే ప్రత్యేక ఆడియో వ్యవస్థను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని, లబ్ధిదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవర్లకు రుసుములు లేదా టిప్పులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో 2025-26 సంవత్సరంలో 24 వాహనాల ద్వారా 9,988 మంది లబ్ధిదారులు సేవలు పొందగా, 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 3,274 మంది ఈ సేవలను వినియోగించుకున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. జగదీశ్వర రావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. ఉష, డీసీహెచ్ఎస్ డా. నరేంద్ర సింగ్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ డా. అప్పారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ప్రారంబించిన కలెక్టర్ విజయ్ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 11:** జిల్లాలో మాతా-శిశు సంక్షేమం, ఆరోగ్య భద్రత దిశగా ఏపీ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రసవించిన బాలింతలను, నవజాత శిశువులను సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు, తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్' (102) నూతన వాహనాలను ప్రారంభిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు.

అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ లతో కలిసి మంగళ వారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లాకు కేటాయించిన 'తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాల రేటును తగ్గించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రసవానంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడం, పేద కుటుంబాల పై రవాణా వ్యయ భారాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గర్భిణీ స్త్రీలకు, ప్రసవించిన బాలింతలను, నవజాత శిశువులను సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు 'తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్' (102) సేవలకు నూతన వాహనాలను ప్రారంభించినట్లు తెలిపారు. నూతన వాహనాల్లో బాలింతల సౌకర్యార్థం ఏసీ, ఎస్ఓఎస్ ఎమర్జెన్సీ బటన్, ఎయిర్‌బ్యాగ్‌లు, ఫుట్‌రెస్ట్‌లు, లైవ్ జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు.

అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఆసుపత్రిలో డెలివరీ ముగిసిన వెంటనే బాలింతలకు, పసిపాపలకు సురక్షితంగా ఇంటికి వెళ్లేందుకు సదుపాయం లేక ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ ఉచిత ప్రయాణ సేవలు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు.









జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో అనకాపల్లి జిల్లాకు 14 అధునాతన తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ప్రసవానంతరం బాలింతలకు ఆర్థిక తోడ్పాటుతో పాటు పసిపాపలకు అవసరమైన 'ఎన్టీఆర్ బేబీ కిట్' కానుకలను తిరిగి అందించే చర్యలు పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, డిఎం అండ్ హెచ్ వో అచ్యుతకుమారి, సి పి ఓ రామారావు, ఎన్టీఆర్ ఆసుపత్రికి

కమిటీ అభివృద్ధి సభ్యులు శాంతకుమారి, డా.డి డి నాయుడు, ఆళ్ల రామచంద్రరావు, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవికుమార్, జిల్లా ఇమ్యూనిసాటిన్ అధికారి డా.చంద్రశేఖర్ దేవ్, ఇతర ప్రోగ్రామ్ అధికారులు ఏఎన్ఎంలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లోకేష్ అంటే జగన్ కు భయం మంత్రి సవిత

- మెగా డీఎస్సీలో అక్రమాలు అంటూ గొడ్డలి పార్టీ డ్రామాలు.
- రుజువులు ఉంటే అసెంబ్లీకి రావాలి,
- జగన్ వి చిల్లర రాజకీయాలు మనాలి.
- ప్రజలు అసహ్యించుకుంటున్నారు.
- బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం మంత్రి సవిత.















**అనంతపురం, పెన్ సత్తా, ఆగస్ట్ 11:** జగన్ కు మంత్రి నారా లోకేష్ అంటే భయం అందుకే, ఎప్పుడో ఏడాది కిందట జరిగిన మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నీ దగ్గర ఆధారాలు ఉంటే చర్చకురా అని మంత్రి లోకేష్ సవాల్ చేసినా జగన్ భయపడి రావడం లేదన్నారు. మళ్లీ మరోసారి జగన్ కి సవాల్ చేస్తున్నా మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని రుజువులు ఉంటే అసెంబ్లీకి రా చర్చిద్దాం అని సవాల్ విసిరారు. మంత్రి నారా లోకేష్ పేరు ఎత్తే అర్హత కూడా జగన్ కు, వైసీపీ నేతలకు లేదు అని, గొడ్డలి పార్టీ చిల్లర రాజకీయాలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండి పడ్డారు. అనంతపురం జిల్లా గుంతకల్లులో రూ.18 కోట్లతో నిర్మించిన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో కలిసి మంత్రి సవిత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె తనను కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బీసీల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. రాయలసీమలో 5, ఉత్తరాంధ్రలో 5 ఎంజేపీ గురుకులాలను ప్రారంభించామన్నారు. వాటిలో గుంతకల్లులో అధికంగా ఉన్న బీసీ జనాభాను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఎంజేపీ గురుకుల పాఠశాలను ప్రారంభించామన్నారు. బీసీల విద్యను గాలికొదిలేసిన జగన్. అయిదేళ్ల వైసీపీ పాలనలో బీసీల విద్యను జగన్ గాలి కొదిలేశారని మంత్రి సవిత మండి పడ్డారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఎంజేపీ గురుకులాల భవనాలు 70 నుంచి 80 శాతం పూర్తయినా జగన్ పట్టించుకోలేదన్నారు. చివరికి పులివెందుల లోని ఎంజేపీ గురుకులానికి సైతం నిధులు మంజూరు చేయలేదన్నారు. తరవాత వచ్చిన కూటమి ప్రభుత్వం అర్థాంతరం నిలిచిపోయిన ఎంజేపీలకు నిధులు మంజూరు చేసి, ఆయా భవనాలను పూర్తి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా గుంతకల్లులో రూ.18 కోట్లతో నిర్మించిన విశాలమైన భవనాలను నిర్మించి, బీసీ బిడ్డలకు అంకింతం చేశామని మంత్రి సవిత తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడుకు డీఎస్సీలు నిర్వహిచడం కొత్త కాదని మంత్రి సవిత తెలిపారు. లక్షలాది టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత ఆయన సొంతమన్నారు. అయిదేళ్ల పాటు జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను, వారి తల్లిదండ్రులను ఊసూరు మనిపించారని జగన్ పై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనివల్ల నిరుద్యోగులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారన్నారు. 2025 మెగా డీఎస్సీని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దిగ్విజయంగా నిర్వహించారన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. ఏడాది కిందట జరిగిన మెగా డీఎస్సీలో ఇప్పుడు అక్రమాలు జరిగాయంటూ జగన్, గొడ్డలి పార్టీ డ్రామాలు ఆడుతోందన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అంటే జగన్ కు భయమని, అందుకే ఆయన రాజీనామా చేయాలంటూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండి పడ్డారు. మంత్రి నారా లోకేష్ దేనికి రాజీనామా చేయాలి, తల్లికివందనం నిధులు అందజేసినందుకా, సంస్కరణలు తీసుకొచ్చి విద్యా శాఖను గాడిలో పెట్టినందుకా, సన్నబియ్యంతో విద్యార్థుల కడుపు నింపుతున్నందుకా, 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసినందుకా..? అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ కార్పొరేషన్ చైర్మన్ వెంకటశివుడు యాదవ్, నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గవర జాతీయలు పేద విద్యార్థులకు ఉపకార వేతనములు.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 11:** గవరపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వలె ఈ సంవత్సరం కూడా సంఘ నియమ నిబంధనలకు సరిపోయే అర్హత గల గవర జాతీయలు పేద విద్యార్థులకు ఉపకార వేతనాములు యిస్తున్నామని ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ తెలియజేశారు. 2026 -2027 పాలిటెక్నిక్, ఐఐఐటి, ఈసెట్టు, ఇంజనీరింగ్, మెడిసిన్, బి డి ఎస్, ఐఐటి, నెట్ మొదలగు టెక్నికల్ కోర్స్ ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంక్ సాధించిన అనకాపల్లి జిల్లా పరిసర ప్రాంతాల గవర పేద విద్యార్థులు ఆ కోర్సుల్లో చేరిన వారు ఉపకార వేతనాలు అప్లికేషన్లు ఈ నెల 13 నుండి ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ ఉపకార వేతనములు కోసం గౌరీ సేవా సంఘం ఆఫీసులో దరఖాస్తు తీసుకోవాలని వారు తెలియజేశారు. పూర్తి చేసిన దరఖాస్తులు 13-09-2026 లోపు ఆఫీసులో అందజేయవలసిందిగా కోరారు. గతంలో స్కాలర్షిప్ తీసుకున్నవారు రెన్యూవల్ కొరకు వార్త లిస్టు హాల్ టికెట్లను సెప్టెంబర్ 13 లోపు ఆఫీసులో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 9291445574 (శ్రీనివాస్) సంప్రదించాలని తెలియజేశారు. ఈ నెల 13 నుండి వచ్చేనెల 11 వ తారీకు వరకు నెల రోజులపాటు హరికథా కాలక్షేపం ఆలయ మండపంలో జరుగుతుందని పాలకవర్గ సభ్యులు తెలియజేశారు. హరికథ విభజన, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మడమల రాంబాబు చే శ్రీమత్ మహాభారతం అనే హరికథ చెప్పబడును.



# రోడ్డు ప్రమాద బాధితులకు పీఎం రాహత్ ద్వారా నగదు రహిత చికిత్స.

**జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.**

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 11:**
రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర సమయంలో సత్వర వైద్యం అందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి -- రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అండ్ అష్యూర్డ్ ట్రీట్‌మెంట్ (పీఎం-రాహత్) పథకాన్ని అమలు చేస్తోంది అని కలెక్టర్ తెలిపారు.

ముఖ్య ఉద్దేశ్యం రోడ్డు ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్' లో (మొదటి గంట) బాధితులకు ప్రాణాపాయం కలగకుండా, వేగవంత మైన నగదు రహిత ఉచిత వైద్య సేవలను అందించడమే ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యం. బాధితులకు ఆర్థిక భారం లేకుండా, నాణ్య మైన చికిత్సను అందజేయడానికి ఈ పథకం రూపొందించబడిందన్నారు. ఈ

పథకం ముఖ్యాంశాలు: నగదు రహిత చికిత్స. ప్రతి రోడ్డు ప్రమాద బాధితుడికి రూ. 1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందించబడుతుంది. సమయ పరిమితి: ప్రమాదం జరిగిన తేదీ నుండి గరిష్టంగా 7 రోజుల వరకు ఈ చికిత్స వర్తిస్తుంది.

స్థిరీకరణ చికిత్స: ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు 48 గంటల వరకు, ఇతర కేసుల్లో 24 గంటల వరకు ఆసుపత్రులు తప్పనిసరిగా స్థిరీకరణ చికిత్స అందించాలి.

డిజిటల్ అనుసంధానం: ఈ ఆదార్, (పోలీస్ రిపోర్టింగ్) టిఏంఎస్ 2.0 (హాస్పిటల్ క్లెయిమ్స్) ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఈ పథకం పూర్తి డిజిటల్ విధానంలో పనిచేస్తుంది.

సహాయం: 112 అత్యవసర ప్రతిస్పందన మద్దతు వ్యవస్థ (ఈఆర్ఎస్ఎస్) ద్వారా బాధితులు లేదా సహాయకులు (గుడ్ సమరిటన్స్) సమీపం లోని ఆసుపత్రులు, అంబులెన్స్ వివరాలను పొందవచ్చు.

అమలు విధానం: ఈ పథకం దేశవ్యాప్తంగా ఉన్న ఎంప్యానెల్డ్ ఆసుపత్రులలో అమలు చేయబడుతుంది. దీనికి సంబంధించి ఆసుపత్రులకు చెల్లింపులు 'మోటారు వాహన ప్రమాద నిధి' (మవాఫ్) ద్వారా జరుగుతాయి. ఈ పథకం ఇతర కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల కంటే ప్రాధాన్యత కలిగి ఉంటుంది. అనకాపల్లి జిల్లాలో - 5 ప్రైవేట్, 8 ప్రభుత్వ ఆసుపత్రిలలో మొత్తం 13 ఆసుపత్రిలలో ఈ పథకం అమలులో ఉందని ఒక పత్రికా ప్రకటన ద్వారా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు.




# ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపిస్తోంది.





**ఇంటింటికీ కార్యక్రమంలో ధర్మవరం తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్.**
**ధర్మవరం మండలం సుబ్బరావుపేటలో డోర్ టూ డోర్ కార్యక్రమం.**
**ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగిన శ్రీరామ్.**


**ధర్మవరం, పెన్ సత్తా, ఆగస్ట్ 11:**
రాష్ట్రం లోని ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపిస్తోందని ధర్మవరం నియోజకవర్గం తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం మండలం సుబ్బరావుపేట గ్రామంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీరామ్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అలాగే గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు గ్రామస్థులు శ్రీరామ్ దృష్టికి పలు సమస్యలు తీసుకురాగా.. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. దీని పై ప్రజల్లో వందశాతం సంతృప్తి కనిపిస్తోందన్నారు. గతంలో గ్రామాల్లో నెలకొన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపించినట్టు తెలిపారు. ముఖ్యంగా రోడ్లు విస్తృతంగా నిర్మాణం జరిగాయన్నారు. మరో వైపు రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని శ్రీరామ్ అన్నారు.

# జిల్లా వ్యాప్తంగా జాతీయ భావాన్ని పెంపొందించేందుకు సమగ్ర ప్రణాళికలు.

**జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.**

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 13 నవ తేదీ నుండి "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరం నుండి జిల్లా అధికారులు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 13 నుండి 15 వరకు ప్రతి ఇల్లు, దుకాణం, ప్రభుత్వ భవనం పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఇల్లు, దుకాణం, పాఠశాల, ప్రభుత్వ కార్యాలయం పై త్రివర్ణ పతాకం స్పష్టంగా రెపరెపలాడాలని స్పష్టం చేశారు. ఐసిడిఎస్ (అంగన్‌వాడీ కేంద్రాలు), డిఎంహెచ్ఓ (పిహెచ్‌సిలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు), డిసిహెచ్ఎస్ ఆసుపత్రులు మరియు రవాణా శాఖ పరిధి లోని అన్ని కేంద్రాలలో, గ్రామ వార్డు సచివాలయాలలో జాతీయ జెండాను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అధికారులందరూ తమ సోషల్ మీడియా ఖాతాలలో వీడియోలను పోస్ట్ చేయాలని తెలిపారు. ఆగస్టు 10 వ తేదీ నుండి 15 వ తేదీ వరకు ఈ ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. సోషల్ మీడియాలో (వ్యక్తి గత పేరుతో)'అనే నేను' క్యాంపెయిన్ లో భాగస్వామ్యంగా మీరు సాధించిన విజయాలు, అందించిన సేవలు లేదా భవిష్యత్తులో దేశం కోసం చేయబోయే మంచి పనులను వివరించి, దేశప్రజలందరికీ "హ్యాపీ ఇండిపెండెన్స్ డే, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు" తెలియజేస్తూ, మరి మీరు దేశం కోసం ఏం చేస్తున్నారు? అని ప్రశ్నిస్తూ మరొకరికి ఛాలెంజ్ విసరాలని తెలిపారు. అధికారులందరూ వీడియో రూపకల్పన పూర్తి చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అనంతరం, ఆ లింకులను వాట్సాప్ గ్రూపుల్లో అప్‌లోడ్ చేయాలని, సమాచార శాఖ అధికారి దీనిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఉద్యోగులు మరియు సచివాలయ సిబ్బంది అందరూ తమ సొంత సోషల్ మీడియా ఖాతాలలో ఈ వీడియో పోస్టులను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ ద్వారా పాఠశాల విద్యార్థులతో కూడా ఇదే శైలిలో వీడియోలను రికార్డు చేయించాలన్నారు. ప్రతీ మండలం నుండి అత్యుత్తమంగా నిలిచే 20 వీడియోలను ఎంపిక చేసి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారికి పంపించాలని కలెక్టర్ తెలిపారు. వీటిని అనకాపల్లి జిల్లా కలెక్టర్ అధికారిక సోషల్ మీడియా ఖాతాలైన యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రదర్శిస్తారని తెలిపారు. ఆగస్టు 13 న ప్రత్యేకంగా 'హర్ ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతీ సైకిల్‌కు జాతీయ జెండాను అమర్చి, జిల్లా స్థాయి అధికారులు కనీసం 1 కిలోమీటరు మేర సైకిల్ తొక్కుతూ ఈ ర్యాలీలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. అధికారులు తమ సిబ్బందితో పాటు స్థానిక పాఠశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులను భాగస్వాములను చేయాలని, ఈ ర్యాలీలో దాదాపు 3,000 నుండి 5,000 మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే రోజు పురపాలక, మండల స్థాయిలలో భారీ సైకిల్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ 1 కిలోమీటరు పరిధిలో ఈ ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 14 న ప్రతి ప్రభుత్వ కార్యాలయం కాంపౌండ్ లోపల లేదా సమీపంలోని పాఠశాల ప్రాంగణాల్లో ప్రతి అధికారి కనీసం 10 స్వదేశీ రకాల మొక్కలను (వేప, రావి, దివి దివి, గానుగ మొదలైనవి) తప్పనిసరిగా నాటాలని ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయం నుండి గ్రామీణ స్థాయి లోని అంగన్ వాడీ కేంద్రాల వరకు అన్ని ప్రభుత్వ భవనాలను ఆగస్టు 14 వ తేదీ సాయంత్రం నుండి 16 వ తేదీ సాయంత్రం వరకు (3 రోజుల పాటు) విద్యుత్ కాంతులతో అలంకరించాలని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున అధికారులందరూ జాతీయ జెండాతో సెల్ఫీ తీసుకొని తమ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల ప్రొఫైల్ చిత్రాలుగా (డీపీ) మార్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్వీ రమణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు: కేంద్రం



అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొంది. ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని, అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేశారు. ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకరించిన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## మా డిమాండ్లలో ఎలాంటి మార్పు లేదు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు తమ డిమాండ్లను మార్చులేదని అన్నారు. విద్యార్థులపై పోలీసుల చర్య, రామ మందిర విరాళాల వ్యవహారం, ప్రభుత్వ క్షమాపణ వంటి మూడు అంశాలపై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వం పార్లమెంట్?లో స్పష్టమైన ప్రకటన చేసే వరకు వాటిని లేవనెత్తుతామని తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

"మేం మా లక్ష్యాన్ని మార్చుకోవడం లేదు. మొదటి నుంచే మా వైఖరి ఒకటే. మూడు నిర్దిష్ట అంశాలపై మేం సమాధానం కోరుతున్నాం. మొదటి అంశం విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జి, కాల్పులకు సంబంధించినది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? అవి ఎలా జరిగిందో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. దీనిపై సభలో సమాధానం కావాలి. లాఠీఛార్జి వల్ల పలువురు విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో పాలయ్యారు. 100 మందికిపైగా స్వల్లంగా గాయపడ్డారు. మరికొందరికి పెల్లెట్ గన్? గాయాలయ్యాయి. ఈ విషయంపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరుతున్నాం. ఘటన జరిగి 18 రోజులు గడిచినా పూర్తి స్థాయి సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. వారు కేవలం ఓ చిన్న ప్రకటన చేసి అంశాన్ని ముగించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. విద్యార్థులపై పోలీసుల చర్యతో పాటు రెండోది రామ మందిర విరాళాల చోరీ. ఇక మూడోది, క్షమాపణలు చెప్పాలి. ఈ మూడు డిమాండ్లు మొదటి నుంచే ఉన్నాయి. ఇప్పటికి కొనసాగుతున్నాయి. పరిష్కారం లభించే వరకు వాటిని విపక్షాలు లేవనెత్తుతాయి"

# ఈ నెల 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్.

**80 వ స్వాతంత్ర్య దినోత్సవం లో భాగంగా దేశ భక్తిని పెంపొందించే పలు కార్యక్రమాలు.**
**దేశ నిర్మాణం లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి.**



విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 11:
ఆగస్టు 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా లోని ప్రతి ఇల్లు, వాణిజ్య సంస్థ ప్రభుత్వ కార్యాలయాల పై మూడు రోజుల పాటు జాతీయ జెండాను ఆవిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పిలుపునిచ్చారు. పరిపాలనా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పౌరులతో కలిసి ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలనీ, 80 వ దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "దేశ నిర్మాణంలో భాగస్వాములు అనే నేను" ప్రచార కార్యక్రమాన్ని ఆగస్టు 10 నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలు కేవలం ప్రేక్షకులుగా కాకుండా, ఈ దేశ నిర్మాణంలో తామూ భాగస్వాములమే అనే భావనతో స్వచ్ఛందంగా పాలుపంచుకునేలా ఈ ముందస్తు కార్యకలాపాలు ప్రభుత్వం రూపొందించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ?మొక్కల నాటే కార్యక్రమం ఆగస్టు 14 న అటవీ మరియు ఉద్యానవన శాఖల సహకారంతో జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద, ముఖ్య ప్రదేశాలలో మొక్కలు నాటి, జాతీయ జెండాను చేతబూని దేశ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఆగస్టు 14 , 15 తేదీలలో ప్రభుత్వ భవనాలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన కూడళ్లను జాతీయ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. జిల్లా లోని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక తరగతుల్లో తాము దేశ భవిష్యత్తు కోసం ఏం చేయగలమో వివరిస్తూ స్వయంగా ప్రతిజ్ఞలు చేయనున్నారని తెలిపారు. జిల్లా లోని యువత, విద్యార్థులు, ప్రముఖులు, క్రీడాకారులు, పౌరులందరూ పార్టనర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్, మై ఇండియా మై విజన్, ఇండిపెండెన్స్ డే 2026 హ్యాష్ టాగ్ లతో, జాతీయ జెండాను చేతిలో పట్టుకుని... (తన పేరు) అనే నేను... దేశ అభివృద్ధి కోసం నా వంతుగా అంటూ 30 నుండి 60 సెకన్ల సెల్ఫీ వీడియోను రూపొందించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఏపీపీవో అఫీసియల్ న్యూస్ పేజీని ట్యాగ్ చేయాలని కలెక్టర్ కోరారు. ?వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, 'ఆలోచిద్దాం, ఆచరిద్దాం, వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం' అనే నినాదంతో ముందుకు సాగాలని జిల్లా ప్రజలకు మరియు అధికారులకు కలెక్టర్ పిలుపునిచ్చారు.

# జార్ఖండ్ లో విద్యార్థుల పై పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నాం.

## రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని ప్రశ్నించిన మాధవ్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 11:** జార్ఖండ్ రాజధాని రాంచీ లో తమ ఉపాధి, ఉద్యోగాలు, భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థుల పై పోలీసులు వ్యవహరించిన తీరును ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తీవ్రంగా ఖండించారు. విశాఖపట్నం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో పీవీయన్ మాధవ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్--జేఎంఎం ప్రభుత్వం అందుకు బదులుగా వారి పై లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం, వాటర్ క్యానన్లు ఉపయోగించడం, బారికేడ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం నిరసన చేస్తున్న విద్యార్థులను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పీవీఎన్ మాధవ్ అన్నారు. విద్యార్థులు తమ సమస్యల పై ప్రశ్నిస్తే వారిని శత్రువులుగా చూడటం కాంగ్రెస్--జేఎంఎం ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమన్నారు. మహిళా విద్యార్థుల పట్ల కూడా అనుచితంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఈ ఘటన పై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని మాధవ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పై దేశవ్యాప్తంగా మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి జార్ఖండ్ విద్యార్థుల ఆవేదన ఎందుకు కనిపించడం లేదని పీవీఎన్ మాధవ్ సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో జరిగే ప్రతి నిరసన పై స్పందించే రాహుల్ గాంధీ, కాంగ్రెస్--జేఎంఎం ప్రభుత్వం అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థుల పై జరిగిన పోలీసు చర్య పై ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు.

విద్యార్థుల భవిష్యత్తు కంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పోలీసులు విద్యార్థుల పై చర్యలు తీసుకుంటే ఒక విధంగా, ఇతర రాష్ట్రాల్లో జరిగితే మరో విధంగా స్పందించడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి కాదా అని అన్నారు. విద్యార్థులకు మద్దతు ఇవ్వడంలో కూడా 'పాలిటిక్స్ ఆఫ్ కన్వీనియెన్స్' ఎందుకు పాటిస్తున్నారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నిజంగా విద్యార్థుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఉంటే జార్ఖండ్‌కు వెళ్లి విద్యార్థులను పరామర్శించి, వారి సమస్యల పై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని పీవీఎన్ మాధవ్ అన్నారు. గత కొద్ది రోజులుగా పార్లమెంట్‌లో ప్రజా సమస్యల పై చర్చ జరగాల్సిన సమయంలో గందరగోళం సృష్టించడమే కాంగ్రెస్ పార్టీ వైఖరిగా మారిందని పీవీఎన్ మాధవ్ విమర్శించారు. మొదట ఒక డిమాండ్, ఆ తర్వాత మరో డిమాండ్, ఇప్పుడు ఇంకో అంశాన్ని తెరపైకి తీసుకురావడం చూస్తుంటే రాహుల్ గాంధీ ప్రతిరోజూ తన 'గోల్ పోస్ట్' ఎందుకు మారుస్తున్నారో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ సభను సజావుగా నడవనివ్వకుండా కాంగ్రెస్ పార్టీ ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి సభలో ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని కేంద్ర మంత్రులు స్పష్టం చేస్తున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ చర్చ నుంచి ఎందుకు వెనక్కి వెళ్తోందని నిలదీశారు.

చర్చకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వం.. చర్చకు సిద్ధంగా లేని ప్రతిపక్షం అన్న పరిస్థితి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తోందని పీవీఎన్ మాధవ్ విమర్శించారు. పార్లమెంట్ ప్రజా సమస్యల పై చర్చించాల్సిన వేదిక అని, రాజకీయ గందరగోళానికి వేదిక కాదని అన్నారు. జంతర్ మంతర్ ఘటనకు సంబంధించి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల పై వాస్తవాలను దేశ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందని పీవీఎన్ మాధవ్ అన్నారు. జంతర్ మంతర్ వద్ద బుల్లెట్లు పేల్చినట్లు చేసిన ఆరోపణలకు ఆధారాలు ఏమిటో రాహుల్ గాంధీ దేశ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

రాజకీయ లబ్ధి కోసం నిర్ధారణ లేని ఆరోపణలు చేయడం, వాటి ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడి లక్షణం కాదని అన్నారు. రాహుల్ గాంధీ ఆరోపణలు చేయడం కాదు ఆధారాలు చూపించండి అని పీవీఎన్ మాధవ్ సవాల్ చేశారు.

రాహుల్ గాంధీ పారిపోవద్దని, చర్చకు భయపడవద్దని పీవీఎన్ మాధవ్ అన్నారు. కేంద్ర హోంమంత్రి పార్లమెంట్‌లో సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, కాబట్టి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వాలని కోరారు. చర్చ జరగాలని, వాస్తవాలు దేశ ప్రజల ముందుకు రావాలని అన్నారు. రాహుల్ గాంధీ వద్ద ఏవైనా ఆధారాలు ఉంటే వాటిని పార్లమెంట్‌లో పెట్టాలని, వాటి పై ప్రభుత్వం సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాధవ్ బీజేపీ తరుపున కొన్ని డిమాండ్లు చేశారు.

జార్ఖండ్‌లో విద్యార్థుల పై జరిగిన పోలీసుల చర్యల పై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరపాలని పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల పై అనవసరంగా కేసులు నమోదు చేసి ఉంటే వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని, విద్యార్థుల న్యాయ మైన డిమాండ్ల పై కాంగ్రెస్--జేఎంఎం ప్రభుత్వం వెంటనే చర్చించి పరిష్కారం చూపాలని కోరారు. విద్యార్థుల పై అధిక బలప్రయోగానికి బాధ్యులైన అధికారుల పై విచారణ జరిపి, తప్పు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా విద్యార్థులు చేసిన ఆరోపణల పై ప్రత్యేకంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు. భారతీయ జనతా పార్టీ జార్ఖండ్ విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తుందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు బలికావడానికి వీల్లేదని అన్నారు. విద్యార్థుల హక్కులు, ఉద్యోగాలు, భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడే ప్రతి విద్యార్థికి బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన ద్వంద్వ వైఖరిని విడనాడి విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా పరిష్కరించేందుకు ముందుకు రావాలని పీవీఎన్ మాధవ్ కోరారు. రాహుల్ గాంధీ పారిపోవద్దు అని, చర్చకు భయపడవద్దు, పార్లమెంట్‌ను పనిచేయనివ్వండి, దేశానికి సమాధానం చెప్పండి అని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ జార్ఖండ్ విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తుంది. యువత భవిష్యత్తు రాజకీయాలకు బలికావడానికి వీల్లేదన్నారు. విద్యార్థుల హక్కులు, ఉద్యోగాలు, భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడే ప్రతి విద్యార్థికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా ప్యానలిస్టులు కే నర్సింగరావు, కేఎన్పి చక్రవర్తి, ఈర్ల శ్రీరామమూర్తి పాల్గొన్నారు.




# ఏపీలో కుటుంబ రాజకీయాలు..సమీకరణలు!

**విజయవాడ, ఆగస్టు 11 :** వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోరుకుంది ఆ ఫ్యామిలీ. అందుకు పార్టీ హై కమాండ్ అంగీకరించకపోవడంతో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కేసుల రూపంలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది.. ఆ ఫ్యామిలీ మద్దతుతోనే పార్టీని ఏర్పాటు చేశారు. తొలి ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా సీట్లు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల, బాబాయ్ వివేకానంద రెడ్డి, సోదరులు అవినాష్ రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటే ఆ ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది. అయితే అదే సమయంలో టిడిపిలో చూస్తే మాత్రం చంద్రబాబుతో పాటు లోకేష్ కు సొంత కుటుంబం దన్ను అంతగా లేకపోయింది. కానీ ఇప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండ తగ్గింది. చంద్రబాబుకు గణనీయంగా పెరుగుతూ వస్తోంది.తెలుగుదేశం అధినేత చంద్రబాబు విషయంలో కుటుంబ పరంగా ఒక భిన్న వాతావరణం ఉండేది. నందమూరి హరికృష్ణ అండగా నిలిచేవారు. కానీ అదే సమయంలో రెబల్గా కూడా వ్యవహరించేవారు. ఎప్పుడు ఎలా ఉండేవారో తెలియంది కాదు. మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం వ్యతిరేకంగా ఉండేవారు. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపారు. మరోవైపు సమీప బంధువు, జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నియా శ్రీనివాసరావు సైతం చంద్రబాబుకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయారు. ఇలా సొంత కుటుంబ సభ్యులే చికాకుల మీద చికాకులు తెచ్చి పెట్టేవారు. మరోవైపు లోకేష్ ఆశించిన స్థాయిలో పట్టు పెంచుకోలేదు అప్పట్లో.అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎవరు మనసులో ఏముంటుందో కూడా చెప్పలేము. అప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండగా నిలబడగా.. ఇప్పుడు అదే ఫ్యామిలీ వ్యతిరేకంగా మారిపోయింది. మొదట చెల్లెలు షర్మిల దూరమయ్యారు. ఆమెకు అండగా నిలిచేందుకు జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు తల్లి విజయమ్మ. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో కుటుంబం అంతా అడ్డగోలుగా చీలిపోయింది. మరో చెల్లెలు సునీత పూర్తిగా ప్రత్యర్థిగా మారిపోయారు. ఇప్పుడు కేవలం జగన్మోహన్ రెడ్డి వెంట కుటుంబంలో నిలిచేది అవినాష్ రెడ్డి, ఆయన ఫ్యామిలీ. మిగతా వారంతా దూరమైనట్టే. కేవలం దూరం మాత్రమే కాదు రాజకీయంగా విభేదించడం కూడా మొదలుపెట్టారు. మొన్నటి ఎన్నికల్లో ప్రభావం కూడా చూపారు..అయితే ఇప్పుడు చంద్రబాబు విషయానికి వద్దాం. నందమూరి ఫ్యామిలీ పూర్తిగా ఆయనకు అండగా నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ సైతం మౌనం వహించక తప్పడం లేదు. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం రాజీ పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపితో తెలుగుదేశం పొత్తుకు పురందేశ్వరి ఒక కారణం. ప్రస్తుతం వారి కుమారుడు సైతం నారా లోకేష్ తో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు నారా రోహిత్ అంటే చంద్రబాబు తమ్ముడి కుమారుడు సైతం లోకేష్ తో కలిసి పని చేస్తున్నారు. ఇంకో వైపు లోకేష్ తోడల్లుడు, నందమూరి బాలకృష్ణ చిన్న అల్లుడు శ్రీ భరత్ సైతం పార్టీకి అండదండగా నిలుస్తూ వచ్చారు.. ఇలా చెప్పుకుంటే ఫ్యామిలీలు ఇప్పుడు అంతా ఒక్కటై చంద్రబాబుకు అండగా నిలబడుతున్నాయి. జగన్మోహన్ రెడ్డితో పోల్చుకుంటే చంద్రబాబుకు ఇప్పుడు ఫ్యామిలీ బలం అదనం.

# వైసీపీకి బూమ్ రాంగ్ అవుతోందా

**విజయవాడ, ఆగస్టు 11 :** రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, చట్టాలు–పరిపాలనపై క్షుణ్ణమైన అవగాహన ఉన్న ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ వంటి వైఎస్సార్సీపీ సీనియర్ నేతలకు ఏది ప్రజాదరణ పొందే అంశమో, ఏది శూన్యమైన విమర్శో స్పష్టంగా తెలుసు. దశాబ్దాల తరబడి ఎన్నికల రాజకీయాలను ఒంటబట్టించుకున్న ఈ అనుభవజ్ఞులకు.. కనీస ఆధారం లేకుండా ప్రతిపక్షం లేవనెత్తే అంశాలు ప్రతికూలతను పెంచుతాయే తప్ప, ప్రజల నుంచి ఒక్క శాతం కూడా సానుకూలతను తీసుకురావు అనే నిలువెత్తు సత్యం తెలియంది కాదు. అయినా సరే, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశిస్తున్న వ్యూహాలకు తలొగ్గి, తమ సొంత రాజకీయ క్రెడిబిలిటీని బలిపీఠం ఎక్కించేసుకుంటున్నారు.గతంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ హయాం నుంచి నేటి వైఎస్సార్సీపీ వరకు సీనియర్ నాయకులుగా చెరగని ముద్ర వేసుకున్న ఈ నేతలు.. జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష రాజకీయ శైలి వల్ల సమాజంలో తమ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారనే చర్చ నడుస్తోంది. డీఎస్సీ వంటి నిరుద్యోగ సున్నిత అంశాలపై ఎటువంటి డాక్యుమెంటరీ ఆధారాలు లేకపోయినా, కోర్టుల్లో విచారణకు కూడా నిలబడే సాక్ష్యాలు చూపించలేకపోయినా.. జగన్ మైక్ ముందు చెప్పిన ప్రతిపాయింట్‌నూ కిందిస్థాయిలో బలవంతంగా మోయాల్సి రావడం వారి రాజకీయ అనుభవానికే అవమానకరంగా మారింది. ఆధారం లేని పోరాటం వల్ల ఎంపికైన 16,000 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది.తన స్వయంకృతాపరాధ నిర్ణయాలతో స్వయంగా నెత్తిపై చేయి పెట్టుకునే భస్మాసుర రాజకీయాన్ని జగన్ నడుపుతుంటే, సీనియర్లు తెలిసీ తెలియక అందులో భాగస్వాములు అవుతున్నారనేది నిగ్గు తేలిన నిజం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి నెట్‌వర్క్ చెప్పినట్లే వినాల్సి వచ్చిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సరే అదే తీరు కొనసాగుతోందని అంతర్గత మధనం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో సంపాదించుకున్న గుర్తింపును, ఇమేజ్‌ను ఒకే వ్యక్తి రాజకీయ ఆధిపత్యం, వ్యర్థ రాజకీయ ఎజెండాల కోసం ధారపోయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.ఇంత బతుకు బతికి సొంత రాజకీయాన్ని, స్వయంప్రతిపత్తిని పక్కనబెట్టి జగన్ రెడ్డి వద్ద ఈ రకంగా డీలా పడిపోవడానికి వారి మనసు ఎలా ఒప్పుతుందోగానీ, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే వారి రాజకీయ జీవితాలకు ఇది తీవ్రమైన నష్టం చేకూరుస్తుంది. అధినేత చెప్పే తప్పుడు కథనాలకు మద్దతుగా ప్రెస్ మీట్లు పెట్టడం ఆపి, ఇప్పటికైనా తమ రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాల్సిన తక్షణం ఆసన్నమైంది. సమాజంలో తమకున్న గౌరవాన్ని కాపాడుకోవడానికైనా లేదా ప్రత్యమ్నాయ రాజకీయ దారులు చూసుకోవడానికైనా ఈ సీనియర్ నాయకులు మౌనం వీడాల్సిన అవసరం ఉంది.

### సాంకేతిక అవకతవకలు, అక్రమాలు

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్షం ఆది నుంచి ఆరోపణలు గుప్పిస్తూనే ఉంది. అయితే ఆ ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క బలమైన చట్టబద్ధమైన ఆధారాన్ని కూడా వైసీపీ బయటపెట్టలేకపోయింది. సాంకేతిక అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఎన్ని కథనాలు అల్లినా, నిరుద్యోగులు గానీ, పరీక్ష రాసిన వేలాది మంది అభ్యర్థులు గానీ వాటిని నమ్మే పరిస్థితి లేదు. న్యాయస్థానాలను ఆశ్రయించి పక్కా సాక్ష్యాధారాలతో సీబీఐ విచారణ కోరడంలో ఆ పార్టీ తరఫు నేతలు ఘోరంగా విఫలమయ్యారు. కోర్టుల్లో నిలబడని, ఆధారాలు సమర్పించలేని కథనాలతో వీధుల్లో రచ్చ చేయడం వల్ల ఆ పార్టీ చేస్తున్నది ప్రజాపోరాటం కాదని, కేవలం ఒక కుట్రపూరిత తప్పుడు రాజకీయం అని సామాన్య ప్రజలకు సైతం అర్థమైపోయింది.అన్నింటికంటే ముఖ్యంగా, ఈ ఉనికి లేని వివాదం వల్ల వైఎస్సార్సీపీ సమాజంలో తీవ్ర ప్రతికూలతను మూటగట్టుకుంటోంది. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 16,347 మంది ఉపాధ్యాయులు, వారి వెనుకున్న వేలాది కుటుంబాలు ఇప్పుడు ప్రతిపక్ష వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. దశాబ్దాల కష్టంతో, పారదర్శకమైన పోటీలో తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమ అర్హతలను, ఆత్మగౌరవాన్ని పదేపదే శంకిస్తూ పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకోవడాన్ని ఆ ఉపాధ్యాయ లోకం సహించలేకపోతోంది. రాయలసీమ నుంచి మొదలై కోస్తాంధ్ర వరకు ఈ ఉద్యోగ విజేతలు ఉపాధ్యాయ ఆత్మగౌరవ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతున్నారు.ప్రజాబలం తోడుకాకపోగా, యువత నుంచి మద్దతు లభించకపోగా, పైగా ఎంపికైన 16 వేలకు పైగా కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకోవడం రాజకీయంగా ఎంత పెద్ద వ్యూహాత్మక తప్పిదమో స్పష్టమవుతోంది. రాలగొట్టుకోవడానికి ఏ రాయి అయితే ఏమిటి అన్నట్లుగా ఆలోచన లేకుండా ఒక ప్రతికూల అంశాన్ని పదేపదే పట్టుకుని వేలాడటం వల్ల వైసీపీకి లభించే రాజకీయ లబ్ధి సున్నా సరేకదా, ఉన్న అరకొర క్రెడిబిలిటీని కూడా నట్టేట ముంచేస్తోంది. ప్రజామోదం లేని ఇటువంటి వ్యర్థ పోరాటాల వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి పడకపోగా, ప్రతిపక్షం తన సొంత ఓటు బ్యాంకునే మరింత దూర చేసుకుంటోందనేది అసలు నిజం

# సునీత ఒంటరి పోరాటం...

**కడప, ఆగస్టు 11 :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి ఎన్నో ఏళ్లుగా వేస్తున్న అత్యంత ప్రాథమిక, కీలకమైన ప్రశ్న ఇదే. ఈ విషయం సీబీఐ అఫిడవిట్‌లోనే ఉంది. బయట ప్రపంచానికి, కనీసం ఇంట్లో పనిచేసే సిబ్బందికి కూడా తెలియక ముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హత్య విషయం ఎలా తెలిసింది? ఈ ఒక్క ప్రశ్నకు చట్టబద్ధంగా విచారణ సంస్థలు సమాధానం కనుగొంటే, హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటపడతారని సునీత బలంగా నమ్ముతున్నారు. తెలంగాణ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో సైతం మార్చి 15, 2019 ఉదయం 6:15 గంటలకు వివేకా పీఏ కృష్ణారెడ్డి ద్వారా వార్త బయటకు రావడానికి ముందే జగన్‌కు ఈ విషయం తెలుసని పేర్కొనడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది.న్యాయస్థానాల్లో ప్రతిపక్ష డిఫెన్స్ లాయర్లు దీనిపై వాదిస్తూ.. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సమాచారం త్వరగా మార్పిడి కావడం సహజమేనని, దాంట్లో నేరపూరిత కోణం ఏమీ లేదని సరిపెట్టుకునే యత్నం చేశారు. అయితే ఇక్కడే అసలు రాజ్యాంగ, న్యాయపరమైన లోపం స్పష్టమవుతోంది. బంధువులకు సమాచారం అందింది అనే సాధారణ సాకుతో వార్త ఎక్కడి నుంచి వచ్చిందో విచారించకుండా విస్మరించడం సమంజసం కాదనేదిసునీత వాదన. హత్య జరిగిన అర్ధరాత్రి దాటిన సమయం నుంచి ఉదయం వరకు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఫోన్ నుంచి నడిచిన వాట్సాప్, వాయిస్ కాల్స్ ఐపీడీఆర్ డేటాను సీబీఐ అఫిడవిట్‌లోప్రస్తావించినప్పటికీ, ఆ సమాచారం కనెక్షన్ చివరగా ఎక్కడ ముగిసిందో పూర్తి స్థాయిలో మనీ–పవర్ ట్రయల్‌తో ముడిపెట్టి తేల్చకపోవడమే అసలు వివాదం.న్యాయం కోసం సునీత పడుతున్న తపన, సాగిస్తున్న పోరాటం సాధారణమైంది కాదు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకు, ఏపీ నుంచి విచారణను తెలంగాణకు బదిలీ చేయించడం వరకు ఆమె అలుపెరగకుండా పోరాడుతున్నారు. హత్య వెనుక ఎవరున్నారనేది ప్రజలందరికీ ఒక అంచనా ఉన్నప్పటికీ.. దానిని చట్టబద్ధమైన సాక్ష్యాధారాలతో కోర్టు ముందు రుజువు చేసి, నిందితులకు శిక్ష పడేలా చేయడమే ఆమె అంతిమ లక్ష్యం. ఏడేళ్లు గడిచినా ఒక మాజీ ఎంపీ కుమార్తె న్యాయం కోసం వ్యవస్థల చుట్టూ తిరగాల్సి రావడం భారతీయ నేర విచారణ వ్యవస్థ లోని మందగమనానికి అద్దం పడుతోంది.ఈ తరుణంలోనే సునీత నేరుగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, కేసులోని పెద్ద కుట్ర కోణాన్ని, ముందస్తు సమాచారం ఎవరికి ఎలా చేరిందనే అంశాన్ని త్వరితగతిన తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పీఠం జోక్యం చేసుకుని సీబీఐ దర్యాప్తునకు స్పష్టమైన కాలపరిమితిని, దిశానిర్దేశాన్ని ఇస్తే తప్ప ఈ కేసు ముడిపడేలా లేదు. ఒక కుటుంబం తమ ఆత్మీయుడిని కోల్పోయి, వ్యవస్థలు సహకరిస్తాయో లేదోనన్న ఆందోళనతో సాగిస్తున్న ఈ ఆత్మగౌరవ పోరాటానికి చట్టం నిజమైన న్యాయం చేస్తుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily



## సంపాదకీయం

## గోప్యతకు గండి!

కళ్లజోడు ధరించడం సాధారణ విషయం. కానీ ఆ కళ్లజోడే మన కంటికి కనిపించే ప్రతి దృశ్యాన్నీ రహస్యంగా చిత్రీకరిస్తే? మనం మాట్లాడే ప్రతి మాటనూ రికార్డు చేస్తే? ఇది భవిష్యత్తు కథ కాదు, వర్తమాన వాస్తవం! కృత్రిమ మేధ, అధునాతన సెన్సర్లు, హై-రిజల్యూషన్ కెమెరాలతో కూడిన స్మార్ట్ కళ్లజోళ్లు ఇప్పుడు మార్కెట్‌లో అందుబాటులోకి వస్తున్నాయి. ధరించిన వ్యక్తి చూసే ప్రతి దృశ్యాన్నీ ఫొటోలుగా, వీడియోలుగా బంధించడం, పాడ్‌కాస్ట్‌లు, సంగీతం వినిపించడం, మైక్రోఫోన్ల ద్వారా చుట్టుపక్కల శబ్దాలను రికార్డు చేయడం, స్పీకర్ల సాయంతో ఫోన్‌కాల్స్ మాట్లాడటం -ఇవన్నీ ఈ కళ్లజోళ్లు అవలీలగా చేసేస్తాయి. సేకరించిన సమాచారమంతా పరికరం మెమొరీలో నిక్షిప్తమై, స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేలా రూపొందించారు. సాంకేతికంగా చూస్తే ఇది అద్భుతమైన ఆవిష్కరణే. కానీ ఈ సౌలభ్యం వెనుక దాగివున్న ప్రమాదమే అసలు చర్చనీయాంశం. ఎందుకంటే, ఈ పరికరాలు సాధారణ కళ్లజోళ్లలా కనిపిస్తూ, ఎదుటివారికి తెలియకుండానే వారిని రికార్డు చేయగలవు. దీన్ని ఒక చిన్న ఎల్‌ఈడీ లైటు మినహా గుర్తించే మార్గం లేదు. అదికూడా తేలికగా కప్పిపుచ్చవచ్చు. అమెరికాలో మెటా సంస్థ తయారుచేసిన రే-బాన్ మెటా కళ్లజోళ్లపై ఐర్లాండ్ డేటా ప్రొటెక్షన్ కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో, ఎల్‌ఈడీ లైటు పరిమాణాన్ని పెంచి, మిణుకుమిణుకుమనేలా మార్చాల్సి వచ్చింది. అయినా, అది సరిపోతుందా అన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే! సాంకేతికత అభివృద్ధి చెందుతున్న వేగానికి, దాన్ని నియంత్రించే చట్టాల రూపకల్పన వేగం సరిపోలడం లేదన్నదే అసలు సమస్య.

ఈ ప్రమాదం కేవలం ఊహాజనితం కాదని ఇప్పటికే పలు సంఘటనలు రుజువు చేశాయి. 2024లో అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఇద్దరు 'ఐ-ఎక్స్‌రే' అనే ఒక పరికరాన్ని రూపొందించారు. రే-బాన్ మెటా కళ్లజోళ్లను కృత్రిమ మేధతో, బహిరంగంగా అందుబాటులో ఉన్న డేటాబేస్‌లతో అనుసంధానం చేసి, కేవలం ఒక్క నిమిషంలో ఎదుటివారి ముఖాన్ని చూసి వారి పేరు, చిరునామా, ఇతర సున్నితమైన వ్యక్తిగత వివరాలను రాబట్టగలిగారు. ఈ ప్రయోగంలో సొంత సహవిద్యార్థుల వివరాలను సైతం వారికి తెలియకుండానే సేకరించారు. ఇది కేవలం ఒక సాంకేతిక ప్రదర్శన మాత్రమే కాదు, స్మార్ట్ కళ్లజోళ్లు ఎంతటి ప్రమాదకర ఆయుధంగా మారగలవో చూపించిన హెచ్చరిక. ఇదే సాంకేతికతను దురుద్దేశపూరితంగా వాడితే, వీధుల్లో నడుస్తున్న అపరిచితుల వివరాలను క్షణాల్లో సేకరించి, స్టాకింగ్, వేధింపులు, డాక్సింగ్‌వంటి నేరాలకు పాల్పడే అవకాశం ఉంది. 'కోతికి కొబ్బరికాయ దొరికినట్టు', సరైన అవగాహన, బాధ్యత లేని వ్యక్తుల చేతికి ఇలాంటి శక్తిమంతమైన సాంకేతిక పరికరాలు అందితే, దాని పర్యవసానాలు అనూహ్యం. మహిళలను, చిన్నారులను రహస్యంగా చిత్రీకరించి వేధించడం, ఆ దృశ్యాలను దురుద్దేశంతో ఎడిట్ చేసి సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేయడం, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తమ సంస్థల రహస్య సమాచారాన్ని, బ్యాంకు ఖాతాల వివరాలను తస్కరించే ప్రమాదం ఉంది. ఇటీవల స్వీడన్‌లో ఒక పరిశోధనాత్మక కథనం ద్వారా వెలుగులోకి వచ్చిన మరో సంచలన విషయం ఏమిటంటే, మెటా సంస్థ తన కృత్రిమ మేధ శిక్షణ కోసం, వినియోగదారుల కళ్లజోళ్ల ద్వారా రికార్డైన ప్రైవేటు ఫుటేజీని కెన్యాలోని ఒక ఉప సంస్థకు మానవ సమీక్ష కోసం పంపిస్తున్నట్టు తేలింది. అంటే, వినియోగదారుడు తనకు తెలియకుండానే తన అత్యంత వ్యక్తిగత క్షణాలను ప్రపంచంలో మరెక్కడో ఉన్న అపరిచితుల కళ్లముందు ఉంచుతున్నాడన్నమాట. ఈ వెల్లడి అనంతరం అమెరికాలో మెటాపై, దాని భాగస్వామ్య సంస్థపై క్లాస్ యాక్షన్ దావా కూడా దాఖలైంది.

ఈ ముప్పును గుర్తించిన పలు దేశాలు, సంస్థలు ఇప్పటికే నివారణ చర్యలు మొదలుపెట్టాయి. ఐరోపా సమాఖ్యలో ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు స్మార్ట్ కళ్లజోళ్లపై నిషేధం విధించే యోచనలో ఉన్నాయి. అమెరికాలో ఎలక్ట్రానిక్ ప్రైవసీ ఇన్ఫర్మేషన్ సెంటర్ వంటి సంస్థలు, ఫెడరల్ ట్రేడ్ కమిషన్‌తోపాటు పలు రాష్ట్రాల అటార్నీ జనరల్లకు లేఖలు రాస్తూ, ముఖ గుర్తింపు సాంకేతికతను ఈ కళ్లజోళ్లలో పొందుపరచకుండా అడ్డుకోవాలని కోరుతున్నాయి. కొన్ని అమెరికా న్యాయస్థానాలు తమ కోర్టు గదుల్లో ఇలాంటి కళ్లజోళ్లను ధరించి చిత్రీకరించడాన్ని నిషేధించగా, న్యూయార్క్ రాష్ట్రంలో మొత్తం న్యాయవ్యవస్థ పరిధిలోనే వీటిపై నిషేధం అమల్లోకి వచ్చింది. సైనిక దళాల్లోనూ విధుల్లో ఉన్నప్పుడు ఫొటో, వీడియో, కృత్రిమ మేధ సామర్థ్యం కలిగిన కళ్లజోళ్లు ధరించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రార్థనా స్థలాలు వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఈ పరికరాలను నిషేధించాలన్న డిమాండ్లు కూడా ఊపందుకుంటున్నాయి. చిన్నారుల భద్రతపై ఆందోళన చెందుతున్న హక్కుల సంఘాలు, కుటుంబ అనుకూల వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా ఈ కళ్లజోళ్లను తమ ప్రాంగణాల్లోకి అనుమతించొద్దని పిలుపునిస్తున్నాయి. అమెరికాలో రాష్ట్రాలవారీగా రికార్డింగ్ సమ్మతి చట్టాలు వేర్వేరుగా ఉండటం, కొన్ని రాష్ట్రాల్లో ఇరు పక్షాల సమ్మతి తప్పనిసరి కావడం వంటివి ఉన్నా, ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండే ధరించదగిన కృత్రిమ మేధ పరికరాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సమగ్ర సమాఖ్య చట్టం అమెరికాలో ఇప్పటికీ లేకపోవడం గమనార్హం. మన దేశంలో పరిస్థితి మరింత ప్రమాదకరం. ఇలాంటి పరికరాలపై స్పష్టమైన నియంత్రణ, లైసెన్సింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల, ఎవరైనా వీటిని కొనుగోలు చేసి ఇష్టానుసారం వాడుకునే అవకాశముంది. సాంకేతిక పురోగతిని ఆపలేం, ఆపకూడదు కూడా. కానీ ఆ పురోగతి సామాన్యుడి గోప్యతను హరించే ఆయుధంగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. రికార్డింగ్ జరుగుతున్నప్పుడు స్పష్టమైన, తప్పించుకోలేని సూచికలు తప్పనిసరి చేయడం, బహిరంగ ప్రదేశాల్లో ముఖ గుర్తింపు సాంకేతికతను నిషేధించడం, సున్నితమైన ప్రాంతాల్లో వినియోగాన్ని పరిమితం చేయడం, ఉల్లంఘనలకు కఠిన శిక్షలు విధించడం వంటి చర్యలు తక్షణావసరం. ఐరోపా దేశాలు, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు చేపడుతున్న చర్యలను మార్గదర్శకంగా తీసుకుని, భారత్ కూడా ఇప్పుడే అప్రమత్తం కాకపోతే, రేపటి రోజున ఈ సాంకేతికత సృష్టించే గోప్యతా సంక్షోభాన్ని ఎదుర్కోవడం మరింత కష్టతరమవుతుంది. టెక్నాలజీ మనకు ఉపయోగపడాలే తప్ప, మనపైనే నిఘా పెట్టే సాధనంగా మారకూడదు అన్నదే ఈ చర్చనుంచి తీసుకోవాల్సిన అసలైన గుణపాఠం!!

# మెట్టు దిగిన మొండితనం!?




ఐదు నెలలుగా సాగుతున్న అమెరికా-ఇరాన్ యుద్ధంలో ట్రంప్ వైఖరి గణనీయంగా మారింది. అణ్వాయుధ రహిత ఇరాన్ డిమాండ్‌ను పక్కనబెట్టి, కేవలం హర్మూజ్ జలసంధి తెరిచే ఒప్పందంతోనే యుద్ధాన్ని ముగించేలా ఉన్నారు. క్షిపణి నిల్వల తగ్గుదల, చమురు ధరలు పెరుగుదల, నవంబరు మధ్యంతర ఎన్నికల ఒత్తిడి, సౌదీ, యూఏఈ, ఖతార్‌వంటి మిత్రదేశాల జోక్యం -ఈ నాలుగు అంశాలే ట్రంప్‌ను వంచేశాయి. మరోవైపు, షరతులు లేకుండా జలసంధి తెరవాలన్న అమెరికా డిమాండ్‌కు ఇరాన్ ససేమిరా అంటూ, బలగాలు వైదొలగాలని పట్టుబడుతోంది. హూతీల ఎర్ర సముద్ర దిగ్బంధనం, ఇరాన్ హెచ్చరికలతో ఉద్రిక్తతలు ఇంకా సద్దుమణగలేదు. దీంతో.. ఇప్పుడు పాక్షిక ఒప్పందంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితికి రావడం గమనార్హం. అతిగా వ్యవహరిస్తే చివరకు వెనక్కి తగ్గక తప్పదన్న సత్యానికి ఇది మరోసారి నిదర్శనం.

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నది సూక్తి మాత్రమే కాదు, రాజనీతిలో శాశ్వత సత్యం కూడా. ఎంతటి అధికారమైనా, ఎంతటి పట్టుదలైనా హద్దు మీరితే అది తనకే ఎదురుతిరుగుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విషయంలో సరిగ్గా ఇదే జరుగుతోంది. ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించినప్పటి నుంచీ 'అణ్వాయుధ రహిత ఇరాన్' అన్న డిమాండ్‌పై మొండిగా నిలబడిన ట్రంప్, ఏప్రిల్ నెలలో "ఈ రాత్రి ఒక నాగరికతే అంతమవుతుంది" అంటూ టెహ్రాన్‌ను హెచ్చరించే స్థాయికి వెళ్లారు. అయితే ఐదు నెలలు గడిచేసరికి పరిస్థితి పూర్తిగా తారుమారైంది. అణు ఒప్పందం అంశాన్ని పక్కనబెట్టి, కేవలం హర్మూజ్ జలసంధి తెరిచే ఒప్పందంతోనే యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధపడుతున్నట్టు అమెరికా మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇది కేవలం దౌత్యపరమైన వెనుకడుగు కాదు, ట్రంప్ మొదటినుంచీ అనుసరిస్తూ వచ్చిన 'గరిష్ఠ ఒత్తిడి' వ్యూహం విఫలమైందనేందుకు స్పష్టమైన సంకేతం. ఏప్రిల్‌లో మొదలైనప్పటి నుంచి ఈ యుద్ధంలో ట్రంప్ ఇచ్చిన హెచ్చరికలు, పెట్టిన గడువులు అనేకసార్లు మారాయి. రెండు వారాల కాల్పుల విరమణలు ప్రకటించడం, అవి కూలిపోవడం, మళ్లీ దాడులకు సిద్ధపడటం, చివరి నిమిషంలో వెనక్కి తగ్గడం -ఈ చక్రం పదేపదే కొనసాగింది. జూన్‌లో కుదిరిన ఒక అవగాహన ఒప్పందం కుప్పకూలిన తర్వాత అమెరికా మళ్లీ నౌకా దిగ్బంధనాన్ని అమల్లోకి తెచ్చింది. దీని కింద అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే 44 వాణిజ్య నౌకలను దారి మళ్లించి, రెండింటిని నిర్వీర్యం చేసి, మరో రెండింటిని తనిఖీ చేసినట్టు వెల్లడించింది. ఈ పరిణామాలన్నీ యుద్ధం ఎంతగా సంక్లిష్టమైందో, ఎంతగా చేజారిపోయిందో స్పష్టం చేస్తున్నాయి.

ట్రంప్ వైఖరి మారడం వెనుక ఒకటి కాదు, అనేక అంశాలు ఒకేసారి ఒత్తిడి తెస్తున్నాయి. మొదటిది, ఆయుధ నిల్వల సంక్షోభం. ఐదు నెలలుగా సాగుతున్న యుద్ధంలో అమెరికా క్షిపణి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. యుద్ధానికి ముందు 2,330 ఉన్న పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్లు ఇప్పుడు 827కు, 452 ఉన్న థాడ్ ఇంటర్‌సెప్టర్లు 232-262కు పడిపోవడం గమనార్హం. ఇది యుద్ధానికి ముందున్న నిల్వకంటే 38 శాతం తక్కువ. ఉత్పత్తిని వేగవంతం చేయాలని రక్షణ శాఖ ఉప మంత్రి స్టీవ్ ఫీన్‌బెర్గ్ ఆయుధ కంపెనీలపై ఒత్తిడి తెచ్చినా, తక్షణ పరిష్కారం కనిపించడం లేదు. క్షిపణులు తగ్గిపోతున్న కొద్దీ, ఒక్క డ్రోన్ లేదా క్షిపణి తప్పించుకుని వచ్చినా అది పెను ప్రమాదానికి దారితీయవచ్చని వాషింగ్టన్‌లోని వ్యూహాత్మక అధ్యయనాల కేంద్రం హెచ్చరిస్తోంది. ట్రంప్ మాత్రం బహిరంగంగా కొరతను ఒప్పుకోకుండా, అవసరమైతే నౌకల్లో ఆయుధాలు వస్తాయని సమర్థించుకుంటున్నా, రక్షణ బడ్జెట్‌ను 90,000 కోట్ల డాలర్ల నుంచి 1,50,000 కోట్ల డాలర్లకు పెంచే బిల్లుకు కాంగ్రెస్‌లో మద్దతు లభించకపోవడం అసలు వాస్తవాన్ని బయటపెడుతోంది. రెండోది, ఆర్థిక ఒత్తిడి. హర్మూజ్‌లో నౌకా రవాణా స్తంభించడంతో చమురు ధరలు తగ్గకపోగా, ఇరాన్‌పై దాడులు వాయిదా వేసిన వెంటనే ధరలు పడిపోవడం గమనార్హం. ఇది ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న అమెరికా ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్న అంశం. మూడోది, రాజకీయ ఒత్తిడి. నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరగనున్న తరుణంలో, సుదీర్ఘ యుద్ధంపై సొంత పార్టీలోనే వ్యతిరేకత పెరుగుతోంది. ఎన్నికలకు ముందు మరో యుద్ధభారాన్ని మోయడం రాజకీయంగా నష్టదాయకమని ట్రంప్‌కు స్పష్టమైంది. నాలుగోది, మిత్రదేశాల ఒత్తిడి. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్‌లతోపాటు పాకిస్తాన్ కూడా పలుమార్లు జోక్యం చేసుకుని దాడులను వాయిదా వేయించడం ట్రంప్ స్వతంత్ర నిర్ణయాధికారంపై పరిమితులు విధించింది. ఈ నాలుగు అంశాలు కలిసి, మొదట్లో అత్యంత కఠినంగా వ్యవహరించిన ట్రంప్‌ను ఇప్పుడు రాజీ దిశగా నెట్టివేశాయి.

అయితే ఇరాన్ వైపునుంచి చూస్తే పరిస్థితి పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. హర్మూజ్ జలసంధిని షరతులు లేకుండా తెరవాలన్న అమెరికా డిమాండ్‌కు టెహ్రాన్ ససేమిరా అంటోంది. దిగ్బంధనం ఎత్తివేయాలని, ప్రాంతం నుంచి అమెరికా బలగాలు వైదొలగాలని, యుద్ధాన్ని శాశ్వతంగా ముగించే వరకూ జలసంధిని తెరవబోమని ఇరాన్ కరాఖండీగా చెబుతోంది. ఒమన్‌తో కలిసి ఒక తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నా, అమెరికాతో నేరుగా చర్చలు జరుగుతున్నాయన్న వాదనను ఇరాన్ విదేశాంగ శాఖ ఖండిస్తూనే ఉంది. తాము కేవలం ఒమన్‌తోనే హర్మూజ్ అంశంపై సంప్రదింపులు జరుపుతున్నామని, జూన్‌లో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించింది అమెరికానేనని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. ఇరాన్ నియంత్రణలో ఉన్న మార్గం మినహా మరే ఇతర మార్గంలోనూ నౌకలను అనుమతించమని, అమెరికా యుద్ధనౌకలు అక్రమ మార్గంలో ప్రవేశిస్తే లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఇరాన్ మద్దతున్న యెమెన్ హూతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో దిగ్బంధనం ప్రకటించడంతో, సౌదీ నౌకలు ఆఫ్రికా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఇది ప్రయాణ సమయాన్ని కనీసం రెండు వారాలు పెంచుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా బలగాలు తమ గడ్డపై అడుగుపెడితే తీవ్ర పరిణామాలు తప్పవని ఇరాన్ బ్రిగేడియర్ జనరల్ అలీ జహన్‌షాహీ మరోసారి హెచ్చరించారు. ఒకవైపు ఆయుధాలు తరిగిపోతూ, మరోవైపు దేశీయ రాజకీయ ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో, తాను తలపెట్టిన 'సంపూర్ణ విజయం' లక్ష్యాన్ని పక్కనబెట్టి, పాక్షిక ఒప్పందంతో సరిపెట్టుకోవడానికి ట్రంప్ మొగ్గు చూపడం అనివార్యమైన పరిణామమే. మొదట్లో బేషరతుగా లొంగిపోవాలని డిమాండ్ చేసిన అమెరికా, ఇప్పుడు దశలవారీగా రాజీపడాల్సిన పరిస్థితికి రావడం, అతిగా వ్యవహరిస్తే చివరకు వెనక్కి తగ్గక తప్పదన్న సత్యానికి నిదర్శనం. ఈ యుద్ధం ఎలా ముగుస్తుందన్నది కాలమే నిర్ణయిస్తుంది, కానీ తొలినాళ్ల మొండి వైఖరి నుంచి నేటి రాజీ దృక్పథానికి ట్రంప్ ప్రయాణం మాత్రం అంతర్జాతీయ రాజకీయాల్లో అధికార పరిమితులకు ఒక కీలక పాఠంగా మిగిలిపోనుంది! ■

## పనికొచ్చే పలుకు



## చిన్న లక్ష్యాలే.. అసలైన వైఫల్యామా?


గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి భయపడి, చిన్న విజయాలతో సరిపెట్టుకోవడంవల్ల కలిగే నష్టాలపై ప్రముఖ అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ లెస్ బ్రౌన్ ఆసక్తికర విశ్లేషణ చేశారు. పరిమితులను దాటి పెద్ద కలలు కనడం ఎంత అవసరమో ఆయన విశ్లేషణలో ధ్వనిస్తుంది. జీవితంలో ఓటమికి అసలు కారణమేమిటి? ఆశించిన ఫలితాలు రాకపోవడమా? లేక మన ఆలోచనా పరిధి చిన్నది కావడంవల్లా? దీనిపై లెస్ బ్రౌన్ చెప్పిన ఒక వాక్యం లక్షలాది మంది ఆలోచనా విధానాన్ని మార్చివేసింది. "చాలా మంది జీవితంలో విఫలం కావడానికి కారణం.. వారు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించలేకపోవడం కాదు.. చాలా చిన్న లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సులువుగా సాధించి అక్కడే ఆగిపోవడం" అంటాడు లెస్ బ్రౌన్. లెస్ బ్రౌన్ తన ప్రసంగాలు, పుస్తకాల ద్వారా ఆత్మన్యూనతా భావాన్ని జయించి, సామర్థ్యాన్ని ముమ్మరంగా ఎలా ఉపయోగించుకోవాలో ప్రపంచానికి వివరించారు. ఈ ప్రసిద్ధ వ్యాఖ్య ఎప్పుడు, ఎక్కడ చెప్పారో ఖచ్చితమైన వివరాలు లేనప్పటికీ, ఆయన ప్రసంగాల్లో ఇది ఎప్పుడూ అత్యంత ప్రభావవంతమైన మాటగా నిలిచింది. మనకున్న ప్రతిభ లేదా అవకాశాల కొరత కంటే, మనల్ని మనం తక్కువగా అంచనా వేసుకోవడమే అతిపెద్ద ఆటంకమని ఈ మాట స్పష్టం చేస్తోంది.

కంఫర్ట్ జోన్ వర్సెస్ ఆశయం

సాధారణంగా అసాధ్యమైన లక్ష్యాలను ఎంచుకోవడం వల్లే మనుషులు విఫలమవుతారని అందరూ భావిస్తారు. కానీ లెస్ బ్రౌన్ ఈ ఆలోచనను సవాలు చేశారు. ఎలాంటి శ్రమ, ధైర్యం అవసరం లేని సాధారణ లక్ష్యాలతో సరిపెట్టుకోవడమే అసలైన వైఫల్యమని ఆయన వాదించారు. సులభంగా సాధించగలిగే లక్ష్యాలు తాత్కాలికంగా సంతృప్తిని ఇవ్వవచ్చు. కానీ, కాలక్రమేణా 'ఇంకా పెద్దగా కలలు కని ఉంటే బాగుండేది' అనే పశ్చాత్తాపం మిగిలిపోతుంది. పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకున్నప్పుడు వైఫల్యం చెందే ప్రమాదం ఉన్నప్పటికీ, ఆ ప్రయాణమే మనుషులను కొత్త విషయాలు నేర్చుకునేలా, తమలో దాగి ఉన్న శక్తులను గుర్తించేలా చేస్తుంది. లెస్ బ్రౌన్ ఉద్దేశం ఓటమిని పొగడటం కాదు, పరిమితులను దాటి ఆలోచించే ధైర్యాన్ని నూరిపోయడమే!

ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, ఓటమిపట్ల భయం, సోషల్ మీడియాలో ఇతరులతో పోల్చుకోవడం, తక్షణ గుర్తింపు కోసం పాకులాడటం వంటివి మనుషులను పెద్ద రిస్కులు తీసుకోకుండా అడ్డుకుంటున్నాయి. కెరీర్ ఎంపిక, వ్యాపారం ప్రారంభించడం, ఉన్నత చదువులు లేదా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంలో చాలామంది సురక్షితమైన మార్గాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే కంఫర్ట్ జోన్ సరిహద్దుల్లో ఎదుగుదల సాధ్యం కాదని లెస్ బ్రౌన్ మాటలు గుర్తుచేస్తున్నాయి. సైన్స్, వ్యాపారం, క్రీడలు, కళారంగాల్లో సాధించిన గొప్ప పురోగతులన్నీ ఒకప్పుడు 'అసాధ్యం' అనిపించిన లక్ష్యాలనుంచే పుట్టుకొచ్చాయి.

ఈ సందేశం విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులకు అద్భుతమైన మార్గదర్శిగా నిలుస్తుంది. ఆలోచించి తీసుకునే రిస్కులను స్వాగతించాలని, ఎదురుదెబ్బలను ఓటములుగా కాకుండా పునాది రాళ్లుగా భావించాలని ఇది నేర్పుతుంది. కేవలం అంతిమ ఫలితాన్ని బట్టి కాకుండా, పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకునే ధైర్యాన్ని బట్టి విజయాన్ని కొలవాలి. మన పరిమితులను దాటి శ్రమించినప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఒకవేళ నిర్దేశించుకున్న పెద్ద లక్ష్యాన్ని పూర్తిగా సాధించలేకపోయినా, ఆ ప్రయాణంలో పొందే జ్ఞానం, సహనం, ఆత్మవిశ్వాసం జీవితాంతం ఉపయోగపడతాయి. అందుకే పెద్ద కలలు కనడానికి, ధైర్యంగా అడుగులు వేయడానికి ఎప్పుడూ వెనుకాడకూడదు.



తిరస్కారానికి భయపడి మనల్ని మనమే తిరస్కరించుకుంటాం. ఎదుటివారు 'నో' చెప్పకముందే, మనసులో ఓటమిని డిసైడ్ చేసేస్తాం. ప్రయత్నించే ధైర్యం, మన సామర్థ్యాన్ని అంచనా వేసుకోగలిగే సత్తా లేకపోవడమే ఇందుకు కారణం. ఫలితంగా, చేతికందే విజయాలను చేజేతులారా జారవిడుచుకుంటాం. గుర్తుంచుకోండి -నిరాకరణ జస్ట్ అభిప్రాయమే. అంతిమ తీర్పు కాదు. ప్రయత్నించి ఓడిపోవడంలో నీకో స్థానముంటుంది. తలుపు తట్టకుండానే.. లోపలివాళ్లు తీయరనుకుంటే ఎలా? మీ శక్తిని మీరే శంకించొద్దు. అడుగేయండి.. -కనీసం ప్రయత్నించిన తృప్తి ఉంటుంది. అదే తరువాత గెలుపవుతుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

## సిక్కడాలతో ఎకసెక్కాలొద్దు!



చైనా జెజియాంగ్ ప్రావిన్స్ నింగ్‌బోలో 18 ఏళ్ల కుర్రాడు క్యాంపింగ్‌కు వెళ్లి, వందలాది జీవులు (సిక్కడాలు) చేసే గోలలో నాలుగు గంటలకు పైగా గడిపాడు. అంతే.. చెవుల్లో మోత, మూసుకుపోయిన అనుభూతి మొదలై చిన్ని శబ్దాలు కూడా వినిపించడం మానేశాయి. ఆసుపత్రికి పరుగెడితే.. రెండు చెవులూ వాచిపోయాయన్నారు వైద్యులు. మందులిచ్చి, రెండు వారాలు గట్టి శబ్దాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదృష్టవశాత్తూ కుర్రాడు కోలుకున్నాడు. ఒక్క సిక్కడా శబ్దం 70 డెసిబెల్స్ దాటకున్నా.. గుంపుగా అరిస్తే 85 డెసిబెల్స్ దాటి చెవులకు హాని కలిగించే స్థాయికి చేరుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువసేపు గట్టి శబ్దాలకు గురైతే చెవిలోని కణాలు ఉబ్బిపోయి, విశ్రాంతితో సాధారణంగా తగ్గిపోతాయి కానీ, కణాలు చనిపోతే మాత్రం వినికిడి శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు తెలిపారు.

# ప్రపంచాన్ని ఏలిన విండీస్‌కు..
# ఇప్పుడు బెర్త్ కోసం అగ్నిపరీక్ష!

- ఒకప్పుడు వన్డే క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం
- రెండుసార్లు ప్రపంచకప్ విజేతకు ఇప్పుడు క్వాలిఫయర్స్ గండం
- నేరుగా అర్హత అవకాశాలకు అఫ్గానిస్థాన్ గండి
- ప్రపంచకప్ చేరాలంటే సుదీర్ఘ క్వాలిఫయింగ్ పోరు
- కరేబియన్ దిగ్గజాలు గట్టెక్కుతారా?.. మళ్లీ నిరాశేనా?



**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏకచక్రాధిపత్యంతో ఏలిన వెస్టిండీస్ జట్టు పరిస్థితి ఇప్పుడు ప్రపంచకప్ బెర్త్ కోసం పాకులాడే స్థాయికి చేరింది. రెండుసార్లు వన్డే ప్రపంచకప్, రెండుసార్లు టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడిన కరేబియన్ జట్టు.. వచ్చే ఏడాది జరిగే 50 ఓవర్ల ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని మరోసారి చేజార్చుకుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం నిర్ణీత గడువు నాటికి ర్యాంకింగ్స్‌లో అర్హత స్థానాల్లో నిలిచే జట్లకు నేరుగా ప్రపంచకప్ బెర్త్ దక్కుతుంది. అయితే ఐర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో అఫ్గానిస్థాన్ విజయంతో పుంజుకోవడం వెస్టిండీస్ అవకాశాలను దెబ్బతీసింది. దీంతో కరేబియన్ జట్టు ఇప్పుడు ప్రపంచకప్‌కు చేరాలంటే కఠినమైన క్వాలిఫయింగ్ ప్రక్రియను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం కూడా వెస్టిండీస్‌కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. క్వాలిఫయర్స్‌లో విఫలమై సుదీర్ఘ క్రికెట్ చరిత్రలో తొలిసారిగా వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేకపోయింది. ఆ పరాభవం కారణంగా తర్వాతి ఛాంపియన్స్ ట్రోఫీ అవకాశాన్నీ కోల్పోయింది. ఇప్పుడు మరోసారి అదే ప్రమాదం కరేబియన్ జట్టును వెంటాడుతోంది. ప్రపంచకప్ బెర్త్ సాధించాలంటే వెస్టిండీస్ సుదీర్ఘమైన అర్హత పోరును దాటాల్సి ఉంటుంది. ప్రధాన క్వాలిఫయర్‌లో అగ్రస్థానాల్లో నిలవడంతో పాటు తదుపరి దశల్లోనూ నిలకడగా రాణించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు ప్రపంచకప్ గెలవనివ్వకుండా అడ్డుగోడలా నిలిచిన జట్టు.. ఇప్పుడు తానే ప్రపంచకప్‌లో చోటు కోసం పోరాడాల్సి రావడం కరేబియన్ క్రికెట్ పతనానికి అద్దం పడుతోంది. వివియన్ రిచర్డ్స్, క్లైవ్ లాయిడ్, గార్డన్ గ్రీనిడ్జ్, మైఖేల్ హోల్డింగ్ వంటి దిగ్గజాలతో ప్రపంచ క్రికెట్‌ను వణికించిన వెస్టిండీస్.. మళ్లీ ఆ వైభవాన్ని అందుకుంటుందా? కఠినమైన అర్హత పోరును దాటి ప్రపంచకప్ వేదికపై అడుగుపెడుతుందా? లేక మరోసారి మెగా టోర్నీకి ప్రేక్షకపాత్రకే పరిమితమవుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## పసికూనకు ప్రపంచకప్ బెర్త్.. రెండుసార్లు ఛాంపియన్‌కు బిగ్ షాక్!

### 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అఫ్గానిస్థాన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అంతర్జాతీయ క్రికెట్‌లో పసికూనగా ప్రస్థానం ప్రారంభించి సంచలన విజయాలతో దిగ్గజ జట్లకు సవాల్ విసురుతున్న అఫ్గానిస్థాన్ మరో ఘనత సాధించింది. 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించింది. ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో మూడు వికెట్ల తేడాతో విజయం సాధించడంతో మెగా టోర్నీలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏలిన రెండుసార్లు వన్డే ప్రపంచకప్ ఛాంపియన్ వెస్టిండీస్‌కు ఈ పరిణామం భారీ షాక్‌గా మారింది. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. బౌలింగ్‌లో మూడు వికెట్లు పడగొట్టిన రషీద్.. బ్యాటింగ్‌లో కీలక సమయంలో 43 బంతుల్లో అజేయంగా 37 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో అతడికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఐదు వన్డేల సిరీస్‌లో అఫ్గానిస్థాన్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. 2023 వన్డే ప్రపంచకప్‌లోనే అఫ్గానిస్థాన్ తన సత్తా ఏమిటో ప్రపంచానికి చాటింది. ఆ టోర్నీలో నాలుగు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్థాన్ వంటి బలమైన జట్లను మట్టికరిపించి సంచలనం సృష్టించింది. రషీద్ ఖాన్ వంటి అనుభవజ్ఞులతో పాటు యువ ఆటగాళ్లు రాణిస్తుండటంతో 2027 ప్రపంచకప్‌లో మరింత మెరుగైన ప్రదర్శన చేయాలన్న పట్టుదలతో అఫ్గాన్ ఉంది.



**విండీస్‌కు అఫ్గాన్ దెబ్బ**

అఫ్గానిస్థాన్ విజయం వెస్టిండీస్ ఆశలపై నీళ్లు చల్లింది.

ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా వెలుగొందిన కరేబియన్ జట్టు 2027 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని కోల్పోయింది. గత ప్రపంచకప్‌నకు కూడా నేరుగా అర్హత పొందలేకపోయిన వెస్టిండీస్.. క్వాలిఫయర్స్‌లోనూ విఫలమై తొలిసారిగా మెగా టోర్నీకి దూరమైంది. ఇప్పుడు మరోసారి అదే కఠిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించేందుకు సెప్టెంబర్ 30ను గడువుగా నిర్ణయించారు. ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు ఆటోమేటిక్ బెర్త్ లభిస్తుంది. మిగిలిన స్థానాలకు ర్యాంకింగ్స్ కీలకం కానున్నాయి. ఐర్లాండ్‌పై విజయంతో అఫ్గానిస్థాన్ తన స్థానాన్ని పదిలం చేసుకోవడంతో వెస్టిండీస్‌కు నేరుగా ప్రపంచకప్ చేరే మార్గం మూసుకుపోయింది. కటాఫ్ తేదీకి ముందు వెస్టిండీస్‌కు మరో రెండు వన్డేలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిలో గెలిచినా అఫ్గానిస్థాన్‌ను వెనక్కినెట్టి నేరుగా అర్హత సాధించే అవకాశం లేదన్న సమీకరణాలు కరేబియన్ జట్టును కలవరపెడుతున్నాయి.

### క్వాలిఫయర్సే దిక్కు!

ఇక వెస్టిండీస్ ప్రపంచకప్‌లో ఆడాలంటే క్వాలిఫయర్స్‌లో సత్తా చాటాల్సిందే. 10 జట్లతో జరిగే అర్హత టోర్నీలో కీలక విజయాలు సాధించి ప్రపంచకప్ బెర్త్‌ను దక్కించుకోవాల్సి ఉంటుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు ప్రపంచకప్ గెలవనివ్వకుండా అడ్డుగోడగా నిలిచిన రెండుసార్లు ఛాంపియన్.. ఇప్పుడు పసికూనగా మొదలైన అఫ్గానిస్థాన్ నేరుగా బెర్త్ కొట్టేస్తుంటే తాను మాత్రం క్వాలిఫయర్స్ బాట పట్టాల్సి రావడం కరేబియన్ క్రికెట్ పతనానికి అద్దం పడుతోంది.

# 29 టెస్టులు.. 29 మైదానాలు!

- ఇదెక్కడి వింత రికార్డు జైస్వాల్!
- ఆడిన ప్రతీ టెస్టుకూ కొత్త వేదికే
- ఒక్క మైదానంలోనూ రెండోసారి ఆడని ఓపెనర్
- గాల్‌లో 30వ టెస్టుతో అరుదైన ఘనతకు అడుగు
- 29 టెస్టుల్లో 2,535 పరుగులు.. ఏడు శతకాలు
- శ్రీలంక సిరీస్‌లో జైస్వాల్‌పైనే అందరి చూపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్టు క్రికెట్‌లో బ్యాటుతో పరుగుల వరద పారించడమే కాదు.. ఓ విచిత్రమైన రికార్డుతోనూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పటివరకు కెరీర్‌లో 29 టెస్టులు ఆడిన జైస్వాల్.. ఆ 29 మ్యాచ్‌లనూ 29 వేర్వేరు వేదికల్లో ఆడటం విశేషం. ఒక్క మైదానం కూడా పునరావృతం కాకపోవడం ఈ రికార్డును మరింత ఆసక్తికరంగా మార్చింది. 2023లో వెస్టిండీస్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన జైస్వాల్.. ఆ తర్వాత భారత జట్టులో రెగ్యులర్ ఓపెనర్‌గా స్థానం సుస్థిరం చేసుకున్నాడు. స్వదేశంతో పాటు విదేశాల్లోనూ వరుసగా అవకాశాలు అందుకున్నా.. ప్రతి టెస్టుకూ వేదిక మారుతూ వచ్చింది. అలా 29 టెస్టులు పూర్తయ్యేసరికి 29 వేర్వేరు మైదానాల్లో ఆడిన అరుదైన ఘనత అతడి ఖాతాలో చేరింది. ఇప్పుడు శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో జైస్వాల్ మరో ఆసక్తికర మైలురాయి అందుకోనున్నాడు. ఆగస్టు 15 నుంచి గాల్‌లో జరిగే తొలి టెస్టు అతడి కెరీర్‌లో 30వది కానుంది. గాల్‌లోనూ జైస్వాల్‌కు ఇదే తొలి టెస్టు కావడంతో '30 టెస్టులు.. 30 వేదికలు' అనే అరుదైన రికార్డు కొనసాగనుంది. జైస్వాల్ ఇప్పటివరకు 29 టెస్టుల్లోని 54 ఇన్నింగ్స్‌లలో 48.75 సగటుతో 2,535 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు శతకాలు, 13 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 214 పరుగులు కాగా.. రెండు ద్విశతకాలు కూడా అతడి ఖాతాలో ఉన్నాయి. 317 ఫోర్లు, 45 సిక్సర్లతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ తనదైన దూకుడు చూపిస్తున్నాడు. జూన్‌లో అఫ్గానిస్థాన్‌పై తన 29వ టెస్టు ఆడిన జైస్వాల్.. ఇప్పుడు శ్రీలంక గడ్డపై సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. ఆగస్టు 15 నుంచి 19 వరకు గాల్‌లో తొలి టెస్టు, 23 నుంచి 27 వరకు కొలంబోలో రెండో టెస్టు జరగనున్నాయి. గాల్ తర్వాత కొలంబో కూడా అతడికి కొత్త వేదిక కావడంతో ఈ విచిత్రమైన రికార్డు మరింత ముందుకు సాగే అవకాశముంది.



# చైనా గడ్డపై శ్రేయాషి చరిత్ర

### అంతర్జాతీయ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకం

### ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు

**న్యూ ఢిల్లీ:** భారత స్కేటింగ్ క్రీడాకారిణి శ్రేయాషి జోషి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటి చరిత్ర సృష్టించింది. చైనాలో ఆగస్టు 9 నుంచి 12 వరకు నిర్వహించిన సీనియర్ ఉమెన్స్ క్లాసిక్ లిషయ్ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ అంతర్జాతీయ టోర్నీలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఇప్పటికే స్వర్ణ పతకాలతో తన ప్రతిభను చాటుకున్న శ్రేయాషి.. ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లోనూ పతకం సాధించి భారత కీర్తిపతాకను రెపరెపలాడించింది. క్లాసిక్ స్లాలోమ్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చి కాంస్యాన్ని అందుకుంది. మహారాష్ట్రలోని పుణెలో జన్మించిన శ్రేయాషి జోషికి చిన్నతనం నుంచే స్కేటింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. మూడేళ్ల వయసులోనే తన సోదరి స్వరాలితో కలిసి స్కేటింగ్ ప్రారంభించింది. ఆరేళ్లు వచ్చేసరికి జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదిగి అందరి దృష్టిని ఆకర్షించింది. 2021లో మొహాలిలో నిర్వహించిన 59వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్పీడ్ స్లాలోమ్, క్లాసిక్ స్లాలోమ్ విభాగాల్లో శ్రేయాషి రెండు స్వర్ణ పతకాలను సాధించింది. 2024లో బెంగళూరులో జరిగిన 62వ జాతీయ చాంపియన్‌షిప్స్‌లోనూ ఇదే జోరు కొనసాగిస్తూ స్పీడ్, క్లాసిక్ స్లాలోమ్ రెండింటిలో స్వర్ణాలు గెలుచుకుంది. రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు సాధించిన భారత స్కేటర్లలో జినేష్ నానల్‌తో కలిసి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2017లో చైనాలోని నాన్‌జింగ్‌లో జరిగిన ప్రపంచ రోలర్ గేమ్స్‌లో కేవలం 12 ఏళ్ల వయసులోనే శ్రేయాషి భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఫ్రీస్టైల్, స్పీడ్ విభాగాల్లో వరుసగా 20, 22వ స్థానాల్లో నిలిచి అంతర్జాతీయ వేదికపై తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 2025లో దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా రోలర్ స్కేటింగ్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి సంచలనం సృష్టించింది. ఇన్‌లైన్ ఫ్రీస్టైల్, క్లాసిక్ స్లాలోమ్‌లో స్వర్ణాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అప్పట్లో రికార్డు నెలకొల్పింది. తాజాగా చైనా గడ్డపై కాంస్య పతకం సాధించి తన విజయ ప్రస్థానంలో మరో చారిత్రక ఘనతను జోడించింది.



# బోదన, శ్రేయస్ అదరహో..

### బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో టైటిళ్లు కైవసం

### లండన్‌లో భారత సంతతి చెస్ ప్లేయర్ల సత్తా

**లండన్:** పసివయసులోనే 64 గళ్ల ఆటపై మక్కువ పెంచుకుని ఆటలో అద్భుతాలు సృష్టిస్తున్న బోదన శివానందన్, శ్రేయస్ రాయల్ బ్రిటన్ గడ్డపై సత్తాచాటారు. 122 ఏండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో భారత సంతతికి చెందిన ఈ ఇద్దరు చెస్ ప్లేయర్లు.. తమ విభాగాల్లో టైటిళ్లు గెలిచి ఔరా అనిపించారు. సుమారు 1,750 మంది ప్లేయర్లు పాల్గొన్న ఈ టోర్నీలో 11 ఏండ్ల బోదన.. మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలువగా ఓపెన్ కేటగిరీలో17 ఏండ్ల శ్రేయస్ విజయం సాధించాడు. ఆదివారం ఉత్కంఠగా జరిగిన ర్యాపిడ్ చెస్ ప్లేఆఫ్స్‌లో బోదన.. ఐర్లాండ్‌కు చెందిన 14 ఏండ్ల త్రిషా కన్యమరలను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో ఆ చిన్నారి బ్రిటన్ యంగెస్ట్ ఉమెన్స్ చెస్ చాంపియన్‌గా సరికొత్త రికార్డులు సృష్టించింది. నార్త్ వెస్ట్ లండన్‌లో నివసిస్తున్న బోదన.. కోవిడ్ సమయంలో చెస్ నేర్చుకుంది. ఇప్పటికే యూకే ఓపెన్ ఉమెన్స్ బ్లిట్జ్ చాంపియన్ గెలవడంతో పాటు బ్రిటీష్ ఉమెన్స్ ర్యాపిడ్ విజేతగా నిలిచి సత్తాచాటింది. తాజాగా క్లాసికల్ ఫార్మాట్‌లోనూ ఆమె టైటిల్ గెలవడం గమనార్హం. ఇక ఓపెన్ విభాగంలో శ్రేయస్.. తొమ్మిది రౌండ్ల తర్వాత బ్రిటన్‌లో అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లను దాటుకుని పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన నిలిచి విజేతగా నిలిచాడు. 15 ఏండ్ల వయసులోనే ఇంగ్లండ్‌లో అతిపిన్న గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపుపొందిన అతడు.. పుట్టింది బెంగళూరులోనే. ఎనిమిదేండ్ల క్రితం శ్రేయస్ తల్లిదండ్రులు లండన్‌లో స్థిరపడ్డారు.

పో'స్టర్!






## మరో మల్టీస్టారర్‌లో..


ప్రస్తుతం వెంకీ మామ హీరోగా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఆదర్శ కుటుంబం, అనీల్ రావిపూడి కలయికలో క్రేజీ మల్టీస్టారర్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఏడాదిలోనే మెగాస్టార్ చిరంజీవితో భారీ మల్టీస్టారర్‌గా కూడా మన శంకర వరప్రసాద్ గారులో కనిపించి అదరగొట్టారు. ఇదిలా ఉండగా వెంకీ మామ మరో భారీ మల్టీస్టారర్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఇండస్ట్రీ టాక్. అయితే ఈసారి అది కోలీవుడ్ స్టార్ హీరోతో అట. తమిళ సినిమా దగ్గర భారీ క్రేజ్ ఉన్న స్టార్ హీరోస్‌లో అజిత్ కుమార్ ఒకరు. రీసెంట్‌గానే తన ఫ్యాన్ దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా తర్వాత అనౌన్స్ చేసిన 'డేర్ డెవిల్' ప్రాజెక్ట్ అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమాలోనే వెంకీ మామ కీలక పాత్ర చేసే అవకాశం ఉన్నట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉందనేది కాలమే నిర్ణయించాలి.

# మళ్లీ.. మొదలైన రచ్చ

కోయంబత్తూరులోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంక్షేమ సంఘాలను ఏర్పాటు చేయాలని, కొత్త సభ్యులను చేర్చుకోవాలని కోరుతూ ప్రముఖ నటుడు ధనుష్ ఫ్యాన్ క్లబ్ పిలుపునిచ్చింది. ఈ పరిణామంతో ధనుష్ రాజకీయ అరంగేట్రంపై కోలీవుడ్‌లో మళ్లీ తీవ్ర చర్చ మొదలైంది. అయితే, ఇప్పటివరకు ధనుష్ వైపునుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ, ఫ్యాన్ క్లబ్ తీసుకున్న నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. 'ఆల్ ఇండియా ధనుష్ ఫ్యాన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్' తరపున కోయంబత్తూరు నార్త్, కౌండంపాలయం, సింగనల్లూర్, సులూర్, మేట్టుపాళ్యం నియోజకవర్గాల్లో అభిమాన సంఘాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘ కార్యవర్గం ప్రకటన చేసింది. కోయంబత్తూరు జిల్లా అధ్యక్షుడు జి శంకర్ మార్గదర్శకత్వంలో కార్యక్రమాలను ముమ్మరం చేయాలని అందులో పేర్కొన్నారు. ధనుష్ ఫోటోతో ఉన్న ఈ నోటీస్‌పై ఆ సంఘం అఖిల భారత అధ్యక్షుడు వి. సుబ్రమణ్య శివ, కార్యదర్శి బి. రాజా సంతకాలు చేశారు. ప్రకటనలో ఎక్కడా ప్రత్యక్షంగా రాజకీయాల గురించి లేదా కొత్త పార్టీ ప్రకటన గురించి ప్రస్తావించనప్పటికీ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం, భారీగా సభ్యులను చేర్చుకోవడం వంటి అంశాలు ఆయన పొలిటికల్ ఎంట్రీ రూమర్లకు మళ్లీ ఊతమిస్తున్నాయి.

ప్రస్తుతం ధనుష్ సినిమాల విషయానికొస్తే.. 'ఓం: చాప్టర్ 1' చిత్రంతో బిజీగా ఉన్నారు. వెంటనే తమిళరసన్ పచముత్తు దర్శకత్వంలో 'డీ56' ప్రారంభించనున్నారు. అలాగే 'కర్ణన్' తర్వాత మరోసారి మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఏఆర్ రెహమాన్ సంగీతంలో నటించనున్నారు.





## ప్రశాంత్‌వర్మ ఛాన్సిచ్చాడా?

టాలీవుడ్ నుంచి రానున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో ప్రశాంత్ వర్మ 'జై హనుమాన్' ఒకటి. బ్లాక్‌బస్టర్ 'హను-మాన్'కు సీక్వెల్‌గా వస్తున్న ప్రాజెక్ట్‌లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా, యంగ్ హీరో తేజ సజ్జ కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ గ్యాప్ తర్వాత సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న పౌరాణిక సూపర్‌హీరో చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నట్టు సమాచారం. ఈ సినిమాకి సంబంధించి ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో క్రేజీ బజ్ వైరల్ అవుతోంది. ఇటీవలి కాలంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ట్రెండింగ్ బ్యూటీ వామికా గబ్బి 'జై హనుమాన్' చిత్రంలో కీలక పాత్రలో నటించనున్నట్టు తెలుస్తోంది. ఇటీవలే కోలీవుడ్ హిట్ చిత్రం 'డిసి' లో తన అద్భుతమైన నటనతో మంచి మార్కులు కొట్టేసిన వామికా.. ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం కానుందనే వార్త అభిమానులను ఉత్సాహపరుస్తోంది. విభిన్న నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న వామికా గబ్బి ఈ చిత్రంలో ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనుందని సమాచారం. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి కన్ఫర్మేషన్ రావాల్సి ఉంది.

# మోర్ డేంజరస్ దేన్.. డి కంపెనీ

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి ముంబై అండర్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. టీ-సిరీస్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'పోలీస్ కంపెనీ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. "ఇట్ ఈజ్ మోర్ డేంజరస్ దెన్ డి కంపెనీ" అనేది ఈ చిత్రానికి సంబంధించిన ట్యాగ్‌లైన్. 1990ల చివరలో, 2000ల ప్రారంభంలో ముంబైలో పెరిగిపోయిన గ్యాంగ్ వార్ కార్యకలాపాలను అణచివేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు స్క్వాడ్ ఆధారంగా సినిమా చేస్తున్నారు. దావూద్ తన ప్రత్యర్థి గ్యాంగ్‌లన్నింటినీ అంతం చేసి 'డి కంపెనీ'ని ఎలా విస్తరించాడో, తర్వాత దావూద్‌కు, చోటా రాజన్‌కు మధ్య జరిగిన గొడవలు ముంబై అండర్ వరల్డ్‌లో ఏ విధంగా పెనుమార్పులకు దారితీశాయో వర్మ సోషల్ మీడియా వేదికగా వివరించారు. ముంబైలో విపరీతంగా పెరిగిన నేరాలను అణచివేయడానికి అప్పట్లో ప్రభుత్వం ఒక ప్రత్యేక స్క్వాడ్‌ను ఏర్పాటు చేసిందని, 1997 నుంచి 2004 మధ్య కాలంలో 300 మందికి పైగా గ్యాంగ్‌స్టర్లను మట్టుబెట్టిందని తెలిపారు. ఈ స్క్వాడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలీసు అధికారి అయిన దయానాయక్ జీవితం, ఆ ప్రత్యేక బృందం చేసిన సాహసాల ఆధారంగా 'పోలీస్ కంపెనీ' సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంలో దయా నాయక్ స్ఫూర్తితో రూపొందించిన ప్రధాన పాత్రలో ప్రముఖ నటుడు హర్షవర్ధన్ రానే కనిపించనున్నారు. ఇప్పటికే ముంబై అండర్ వరల్డ్ నేపథ్యంలో 'సత్య', 'కంపెనీ' వంటి ఐకానిక్ చిత్రాలను అందించిన రామ్ గోపాల్ వర్మ, ఈసారి తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో నటిస్తున్న ఇతర నటీనటుల వివరాలను చిత్ర యూనిట్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.






## కొత్తలోక రికార్డులకు తుడక్కం బ్రేక్



మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ. జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ.2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ.6.63 కోట్లు) ప్రపంచవ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్ లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# కల్కి-2లో నటిస్తారా..!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడి' 2024లో విడుదలై సంచలన విజయాన్ని అందుకుంది. సోషియో ఫాంటసీ, మైథలాజికల్ యాక్షన్ అంశాలతో రూపొందిన చిత్రం బాక్సాఫీస్‌వద్ద భారీ వసూళ్లు సాధించడమే కాదు.. 'కల్కి సినిమాటిక్ యూనివర్స్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచింది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి-2' తెరకెక్కుతోంది. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా మేకర్స్ కీలక ప్రకటన చేశారు. ప్రతిభ ఉన్న ఔత్సాహిక నటీనటులకు ఈ క్రేజీ యూనివర్స్‌లో భాగమయ్యే అవకాశం కల్పిస్తూ కాస్టింగ్ కాల్ ప్రకటించారు. నటనపై ఆసక్తి ఉండి, తమ ప్రతిభను నిరూపించుకోవాలనుకునే వారికి ఇదొక అద్భుతమైన అవకాశమని చిత్ర బృందం తెలిపింది. ఏజ్ లిమిట్, జెండర్ పరిమితులు లేవని.. టాలెంట్ ఉంటే చాలని స్పష్టం చేసింది. 'యాక్టర్స్‌గా రాణించాలనుకునే వారందరికీ గొప్ప అవకాశం. 'కల్కి సినిమాటిక్ యూనివర్స్'లో భాగమవ్వండి" అంటూ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా కాస్టింగ్ కాల్ ఇచ్చారు. ఆసక్తి ఉన్న నటీనటులు తమ వ్యక్తిగత వివరాలతో పాటు పోర్ట్‌ఫోలియోను kalkiuniversecasting @gmail.comకు పంపించాలని వైజయంతీ మూవీస్ పేర్కొంది. 'కల్కి భారీస్థాయిలో విస్తరిస్తున్న 'కల్కి సినిమాటిక్ యూనివర్స్'లో కొత్త ముఖాలను పరిచయం చేయడానికి నాగ్ అశ్విన్, వైజయంతీ మూవీస్ చేస్తున్న ప్రయత్నంగా దీనిని భావిస్తున్నారు. ప్రభాస్ వంటి పాన్ ఇండియా స్టార్ నటిస్తున్న సినిమాలో కనిపించే అవకాశం రావడంతో ఈ కాస్టింగ్ కాల్‌పై ఔత్సాహిక నటీనటుల్లో ఆసక్తి పెరిగింది.




PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com